నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com
హైదరాబాద్ శనివారం 9-5-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 248 పేజీలు: 4 వెల: రూ.1/-

## రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### -నిధులు విడుదలపై కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్,మే8(ఆర్ఎన్ఎ): తెలంగాణ రైతుల సంక్షేమానికి టీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. రైతు రుణమాఫీకి రూ. 1200 కోట్ల విడుదలకు సీఎం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో రైతు రుణమాఫీ కింద 5.50 లక్షల మంది లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. వానాకాలం రైతుబంధుకు కూడా రూ. 7 వేల కోట్ల విడుదల చేయడంతో ఈ పథకం కింద 57 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. రైతుల ఖాతాల్లో రెండు, మూడు రోజుల్లో నగదు జమ కానుందని కేటీఆర్ తెలిపారు.రాష్ట్రంలో రైతాంగాన్ని ఆదుకోవడానికి రూ. 25 వేల లోపు ఉన్న రుణాలను ఒకేసారి మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నగదును నిన్న ఆర్థిక శాఖ విడుదల చేసింది. రుణమాఫీ సొమ్మును రైతులకు చెక్కుల రూపంలో అందించాలని ప్రభుత్వం ముందుగా భావించింది. కానీ.. ప్రస్తుతం లాక్‌డౌన్ నేపథ్యంలో రైతుల ఖాతాల్లోకే డబ్బులను నేరుగా బదిలీ చేయాలని నిర్ణయించింది.

# రైలు పట్టాలపై తెల్లారిన బతుకులు

### వలసకూలీలను నిద్రలోనే మింగేసిన మృత్యువు

### పట్టాలపై పడుకున్న కూలీలపై దూసుకెళ్లిన గూడ్సు

## 16మంది మృతి..

### పులువరికి తీవ్ర గాయాలు

### ఘటనపై ప్రధాని తదితరుల సంతాపం





ముంబై,మే8(ఆర్ఎన్ఎ): మరో విషాద ఘటన చోటు చేసుకుంది. లాక్‌డౌన్ కారణంగా వలస కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందనుకుంటున్న తరుణంలో వారిపై రైలు దూసుకెళ్లడంతో పలువురు మృత్యువాత పడ్డారు. కరోనా కష్టకాలంలో చావు ఎవరికీ ఎప్పుడు, ఎలా వస్తుందో తెలియని పరిస్థితి ఈ ఘటన రుజువు చేసింది. కరోనా వస్తే చస్తామని భయపడుతున్న వలస కార్మికులను మరో రూపంలో మృత్యువు మింగేస్తుంది. పట్టాలపై పడుకున్న వలస కార్మికులు లేచేసరికి బతులకు తెల్లారాయి. ఔరంగాబాద్ రైలు ప్రమాద ఘటనలో 16 మంది వలస కార్మికుల మృత్యువాత అందరిలో విషాదాన్ని నింపింది. మహారాష్ట్ర లోని ఔరంగాబాద్ సమీపంలో శుక్రవారం ఉదయం రైల్వే ట్రాక్‌పై నిద్రిస్తున్న వలస కూలీలపై నుంచి గూడ్స్ రైలు దూసుకెళ్లిన ఘటనలో 16 మంది మృతిచెందగా.. ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను ఔరంగాబాద్ ప్రభుత్వాసు పత్రికి తరలించారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలోని నాందేడ్ డివిజన్‌లో ఔరాంగా బాద్-జాల్నా మార్గంలో ఈ ప్రమాదం జరిగిందని ఎస్‌సీఆర్ ముఖ్య సమాచార అధికారి తెలిపారు. ఔరాంగాబాద్ జిల్లా కర్మాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన చోటుచేసుకుందని వెల్లడించారు. మృతులు మధ్యప్రదేశ్‌కు చెందిన వారని చెప్పారు. దీంతో అలసిపోయి రైలు పట్టాలపై పడుకున్న వారు అనంతలోకాలకు వెళ్లిపోయారు. రైలు పట్టాలపై మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. వారు తెచ్చుకున్న ఆహారం పట్టాల మధ్య పడిపోయింది. ఈ దృశ్యాలు కంటతడి పెట్టించేలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని ఉమార్యా, సాహ్‌డోల్ గ్రామాలకు చెందిన సుమారు 19 మంది వలస కార్మికులు పొట్టకూటి కోసం మహారాష్ట్ర జల్నాలోని ఎస్ఆర్‌జీ కంపెనీలో పని చేసేందుకు వచ్చారు. లాక్‌డౌన్ కారణంగా ఎస్ఆర్‌జీ కంపెనీని మూసేశారు. పూట గడవడం కష్టంగా మారడంతో ఈ 19 మంది కూలీలు తమ సొంతూర్లకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఆ కూలీలు తమ ప్రయాణాన్ని జల్నా నుంచి ప్రారంభించారు. సాయంత్రం 7 గంటల సమయంలో కూలీలు తమ నడకను ప్రారంభించి.. రోడ్డు మార్గాన బద్నాపూర్‌కు చేరుకున్నారు. అక్కడ్నుంచి ఔరంగాబాద్‌కు వెళ్లేందుకు రైల్వే మార్గాన్ని కూలీలు ఎంచుకున్నారు. బద్నాపూర్ నుంచి 36 కిలోమీటర్లు నడిచిన తర్వాత కూలీలంతా అలసిపోయారు. రాత్రి కావడంతో.. విశ్రాంతి తీసుకుందామని.. పట్టాలపైనే నిద్రించారు. 14 మంది రైలు పట్టాలపై పడుకోగా, మరో ఇద్దరు పట్టాల పక్కన, మరో ముగ్గురు ట్రాక్‌కు దూరంగా పడుకున్నారు. మరికాసేపట్లో నిద్ర లేచి తమ ప్రయాణాన్ని ప్రారంభిద్దామనుకునే లోపే వలస కూలీలను మృత్యువు మింగేసింది. వేగంగా వచ్చిన గూడ్స్ రైలు కూలీలపై దూసుకెళ్లింది. అక్కడికక్కడే 14 మంది చనిపోగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాద ఘటనపై ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. బతుకుదెరువు కోసం ఇల్లు వదిలి వెళ్లిన బడుగు జీవుల బాధలు వర్ణాతీతం. రెక్కాడితే కానీ డొక్కాడని వారి జీవితాలకు మరిన్ని కష్టాలు తోడు అయ్యాయి. తినడానికి తిండి లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉపాధి లేకపోవడంతో.. పస్తుండాల్సిన పరిస్థితి. పూట గడవడం కష్టంగా మారింది. కుటుంబ పోషణ భారంగా మారడంతో.. చేసేదేమీ లేక సొంతూరికి పయనమవుతున్నారు. అలా సొంతూర్లకు వెళ్తున్న వారి పరిస్థితి దారుణం. కొందరు ఆకలితో అలమటిస్తుంటే.. మరికొందరు నీరసించి కుప్పకూలిపోతున్నారు. ఇంకొందరు ప్రమాదాలకు గురై మరణిస్తున్నారు.

## గూడ్సు దుర్ఘటనపై ఉద్ధవ్ సంతాపం

### మృతుల కుటుంబాలకు 5లక్షల పరిహారం

ముంబై,మే8(ఆర్ఎన్ఎ): గుడ్స్ రైలు ప్రమాదంలో మరణించిన వలస కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారంగా రూ. ఐదు లక్షలు చెల్లించనున్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే ప్రకటించారు. మహారాష్ట్ర నుంచి మధ్యప్రదేశ్‌లోని తమ సొంతరాష్ట్రాలకు వెళ్తున్న వలస కార్మికులు ఔరంగాబాద్ సమీపంలో గూడ్సు రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 16 మంది కార్మికులు మృతిచెందగా, చాలా మంది గాయపడ్డారు. వీరి మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన ఉద్ధవ్ థాక్రే, వలస కార్మికులు ఎట్టిపరిస్థితుల్లో తమ మనోస్థైర్యాన్ని కోల్పోవద్దని, వీలైనన్ని ఎక్కువ రైళ్లు నడపడానికి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని వెల్లడించారు. మృతులంతా జాల్నాలోని స్టీల్ కంపెనీలో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారి చికిత్సకయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ముంబైతో సహా, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి గత నాలుగైదు రోజుల్లో సుమారు లక్ష మంది వలక కార్మికులు తమ సొంత రాష్ట్రాలకు సురక్షితంగా చేరుకున్నారని వెల్లడించారు.

# రైలు ప్రమాద ఘటనపై పలువురు దిగ్భ్రాంతి

## ఊహకందని విషాదమన్న అమిత్ షా

న్యూఢిల్లీ,మే8(ఆర్ఎన్ఎ): ఔరంగాబాద్ గూడ్స్ రైలు ప్రమాదంపై పలువురు ప్రముఖులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఇది ఊహకు అందని ఘోరమని అభివర్ణించారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పందించారు. మాటలకందని బాధ ఉందని ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. రైలు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వలస కూలీల విషయంలో తీవ్ర బాధగా ఉంది. ఆ బాధ మాటలకు అందడం లేదు. ఈ విషయంపై ఇప్పుడే కేంద్ర రైల్వే మంత్రి పీయూశ్ గోయల్‌తో మాట్లాడా. సత్సంబంధిత అధికారులతో కూడా మాట్లాడా. అవసరమయ్యే పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆదేశించా. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నా' అని అమిత్‌షా ట్వీట్ చేశారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై నిద్రిస్తున్న వలస కూలీలపై గూడ్స్ రైలు దూసుకెళ్లింది. ఈ ఘటనలో 15 మంది వలస కూలీలు మృతి చెందారు. ఇందులో కొందరు చిన్నారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వలస కూలీలు మధ్యప్రదేశ్ నుంచి చత్తీస్‌గఢ్ వెళ్తున్నట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

రాహుల్ దిగ్భ్రాంతి

ఔరంగాబాద్ సమీపంలో జరిగిన గూడ్స్ రైలు ప్రమాదంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆయన ట్వీట్ చేశారు. 'వలస కూలీలు మృతి చెందారన్న వార్త విని షాక్‌కు గురయ్యా. జాతి నిర్మాతలుగా ఉన్న వలస కూలీల విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సిగ్గు చేటు. చనిపోయిన వలస కూలీల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నా. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వలస కూలీలు తొందరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై నిద్రిస్తున్న వలస కూలీలపై గూడ్స్ రైలు దూసుకెళ్లింది. ఈ ఘటనలో 16 మంది వలస కూలీలు మృతి చెందారు. ఇందులో కొందరు చిన్నారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వలస కూలీలు మధ్యప్రదేశ్ నుంచి చత్తీస్‌గఢ్ వెళ్తున్నట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

మమతా బెనర్జీ కన్నీరు

మహారాష్ట్రలోని ఔరంగాబాద్ వద్ద 16 మంది వలస కూలీలను బలితీసుకున్న రైలు ప్రమాదంపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. అమాయకులైన వలస కార్మికులపైకి గూడ్సురైలు దూసుకెళ్లిన భయానక ఘటన గురించి తెలిసి దుఃఖం ఆపుకోలేకపోయాను. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను.. అని మమత ట్వీట్ చేశారు. శుక్రవారం ఉదయం ఔరంగాబాద్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై నిద్రిస్తున్న వలస కూలీలపై గూడ్స్ రైలు దూసుకెళ్లడంతో 15 మంది వలస కూలీలు మృతి చెందారు. ఇందులో కొందరు చిన్నారులు కూడా ఉన్నట్లు చెబుతున్నారు.

# కైలాస మానస సరోవరానికి కొత్త రూటు ప్రారంభం..



న్యూఢిల్లీ,మే8(ఆర్ఎన్ఎ): టిబెట్‌లోని కైలాస మానససరోవరానికి ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు వెళ్తుంటారు. అయితే మానస సరోవరాన్ని త్వరగా చేరేందుకు రూపొంది ంచిన కొత్త మార్గాన్ని శుక్రవారం ప్రారంభించారు. టిబెట్, ఉత్తరాఖండ్ సరిహద్ద మార్గంలో లిపులేక్ నుంచి ఈ రూటును వేశారు. 80 కిలోమీటర్ల ఆ మార్గాన్ని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభం చేశారు. అయితే ఈ రూటులో వెళ్తే లిపుకేక్ పాస్ నుంచి కైలాస మానస సరోవరం సుమారు 90 కిలోమీటర్లు ఉంటుంది. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఈ రోడ్డు మార్గాన్ని మంత్రి ఓపెన్ చేశారు. ఈ రూటులో వెళ్లే యాత్రికులు కేవలం వారం రోజుల్లోనే తమ ప్రయాణాన్ని ముగించుకుంటారన్నారు. ఇతర పాత రూట్లలో మానస సరోవరానికి వెళ్లేందుకు కనీసం మూడు వారాల సమయం పట్టేది. ఉత్తరాఖండ్‌లోని ఘటియాబాగర్ నుంచి టిబెట్‌లోని లిపులేక్ పాస్ వరకు కొత్త రోడ్డు మార్గం వేశారు. ఈ రోడ్డుతో దశాబ్దాల కలం నిజమైందని, స్థానికులు, భక్తుల ఆంకాక్షలు నెరవేరినట్లు రాజ్‌నాథ్ తెలిపారు. ఈ రోడ్డు మార్గం వల్ల వాణిజ్యం కూడా పెరుగుతుందన్నారు. దళాల తరలింపులోనూ ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా పనిచేస్తుందని మిలిటరీ అధికారులు చెప్పారు.

## మాస్కులు లేకుండా తిరిగే వాళ్లను గుర్తిస్తున్నాం : డీజీపీ

హైదరాబాద్ , మే 8: కరోనా నియంత్రణకు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ మాస్కు ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. మాస్కు ధరించని వారికి రూ. 1000 జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరించారు. అయినప్పటికీ కొందరు మాస్కులు ధరించకుండా యథేచ్ఛగా తిరుగుతున్నారు. ఈ క్రమంలో మాస్కులు ధరించని వారిని గుర్తించేందుకు కృత్రిమ మేధస్సును ఉపయోగించాలని రాష్ట్ర పోలీసు శాఖ నిర్ణయించింది.ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో మాస్కులు ధరించకుండా తిరిగే వాళ్లను గుర్తిస్తున్నామని డీజీపీ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. దీని కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగిస్తున్నామని ఆయన చెప్పారు. దేశంలోనే తొలిసారి రాష్ట్రంలో వినూత్న ప్రయోగం చేపట్టామన్నారు. సీసీ కెమెరాల ద్వారా జనసమూహాల పరిశీలన కూడా జరుగుతుందన్నారు. త్వరలోనే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో అమలు చేస్తామని డీజీపీ మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

## కవ్వింపు చర్యలను ఆపని పాక్

### భారత్ కాల్పుల్లో ముగ్గురు పాక్ జవాన్లు హతం

శ్రీనగర్,మే8(ఆర్ఎన్ఎ): సరిహద్దుల్లో పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతుంది. పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూనే ఉంది. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ సైనికులు కాల్పులకు పాల్పడ్డారు. పాక్ కాల్పులను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. భారత్ జరిపిన కాల్పుల్లో ముగ్గురు పాకిస్తాన్ సైనికులు హతమయ్యారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. పాక్ స్థావరాలను కూడా భారత్ సైనికులు ధ్వంసం చేశారు. నిన్న పాకిస్తాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో పూంచ్ జిల్లాలో రెండు ఇండ్లు ధ్వంసమయ్యాయి. ఓ పౌరుడికి తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే.

## మహారాష్ట్రలో పరీక్షలు లేకుండానే పై తరగతులకు

ముంబై, మే 8: లాక్‌డౌన్ ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ఉన్నత విద్యకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల విద్యార్థులను ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండానే పై తరగతులకు ప్రమోట్ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మహారాష్ట్ర ఉన్నత, సాంకేతిక విద్యాశాఖ మంత్రి ఉదయ్ సామంత్ ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ యూనివర్సిటీల పరిధిలోని అన్ని కాలేజీలకు తమ ఉత్తర్వులు వర్తిస్తాయని ఆయన తెలిపారు. అయితే, అన్ని కోర్సుల ఫైనల్ ఇయర్ విద్యార్థులు మాత్రం పరీక్షలు రాయాల్సిందేనని మంత్రి సామంత్ స్పష్టంచేశారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జూలైలో పరీక్షలు నిర్వహిస్తామన్న మంత్రి.. దానికి సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తామని చెప్పారు.

### చరిత్రలో నేటినిజం







(మే 9 రాణా ప్రతాప్ జయంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210

## దెబ్బతిన్న ఆర్థిక రంగానికి చికిత్స చేయాలి

### తగు ప్రోత్సాహకాలతోనే బయటపడగలం

### ఆర్థికవేత్తలు... పారిశ్రామికవేత్తలదీ ఇదే అభిప్రాయం

న్యూఢిల్లీ,మే8(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి కారణంగా దేశవ్యాప్త లాక్‌డౌన్‌తో ఆర్థిక కార్యకలాపాలు నిలిచిపోవడంతో ఆర్థిక రంగం కుదేలైంది. ఇప్పట్లో కుదురుకోవడ కష్టమని ఆర్థిక పండితులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వాలు తీసుకునే చర్యలపై దీని పునరుద్దరణ ఆధారపడి ఉంటుందని అంటున్నారు. ఎకానమీ కుదురుకునేందుకు చాలా సమయం పడుతుందని పరిశ్రమ సంస్థ సీఐఐ కూడా ఇప్పటికే స్పష్టం చేసింది. ఆర్థిక ఊతం ఇస్తే తప్ప కోలుకోవడం కష్టమని రఘురామరాజన్ తదితర ఆర్థివేత్తలు చెబుతున్నారు. ఆర్థిక వ్యవస్థ కోలుకునేందుకు ఏడాది సమయం పడుతుందని సీఐఐ నిర్వహించిన సీఈవోల సర్వే వెల్లడించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసంలో రాబడులు 40 శాతం పైగా పడిపోతాయని సర్వేలో పాల్గొన్న వారిలో 65 శాతం మంది సీఈవోలు పేర్కొన్నారు. లాక్‌డౌన్ ముగిసిన అనంతరం ఆర్థిక వ్యవస్థ సాధారణ స్థితికి చేరుకునేం దుకు ఏడాది సమయం పడుతుందని 45 శాతం మంది సీఈఓలు అంచనా వేశారు. లాక్‌డౌన్ తర్వాత ఉద్యోగాల్లో కోత తప్పదని సగానికి పైగా సంస్థలు వెల్లడించాయి. 15 నుంచి 30 శాతం వరకూ ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని 45 శాతం మంది సీఈవోలు పేర్కొన్నట్టు సర్వే వెల్లడించింది. ఇక తమ సంస్థల్లో వేతన కోతను అమలు చేయబోమని మూడింట రెండువంతుల మంది సీఈవోలు వెల్లడించడం ఊరట కలిగిస్తోంది. కరోనా మహమ్మారిని అరికట్టేందుకు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలు సానుకూల ఫలితాలనిచ్చినప్పటికీ ఆర్థిక కార్యకలాపాలు పూర్తి నిలిచిపోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపిందని పారిశ్రామికవేత్తలు కూడా హెచ్చరిస్తున్నారు. ఇపుడు ఆర్థిక పతనంనుంచి కాపాడేందుకు త్వరగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. వైరస్ కట్టడితోపాటు ప్రస్తుతం ఆర్థిక శ్రేయస్సుపై కూడా దృష్టి పెట్టడం అత్యవసరమని పలువురు వ్యాఖ్యానించారు. ఎకానమీ జారిపోకుండా సత్వరమే చర్యలు చేపట్టాలని కోరారు. కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడంతోపాటు ఆర్థిక వ్యవస్థ పతనం కాకుండా చూడాలన్నారు. దేశంలో ఆర్థికమాంద్యం కూడా ప్రమాదమేనని పేర్కొన్నారు. అలాగే అతి తక్కువ సమయంలో ఆర్థిక వ్యవస్థ పుంజుకుని సామర్థ్యానికి సాధించేందుకు కొత్త పని మార్గాలను కనుగొనాలని అన్నారు. దేశవ్యాప్త లాక్‌డౌన్ ప్రతి రంగంలోని వ్యాపారాలను ప్రభావితం చేసింది. అవసరమైన వస్తువులు, సేవలను మినహాయించి 40 రోజుల లాక్‌డౌన్ దేశంపై తీవ్ర ప్రభావాన్ని చూపనుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ దశలో ఆయా రంగాలకు ప్రోత్సాహకాలు ఇచ్చి ముందుకు సాగితేనే మనుగడ సాధ్యమని అంటున్నారు.

## తెలంగాణకు తిరిగి వస్తున్నవలస కూలీలు

హైదరాబాద్ : కరోనా నేపథ్యంలో దేశ వ్యాప్తంగా లాక్ డౌన్ విధించడంతో ఉపాధి లేక వలస కూలీలు తమ సొంత రాష్ట్రాలకు తరలివెళ్తున్నారు. అయితే ఇందుకు పూర్తి భిన్నంగా తెలంగాణలో ఉపాధి కోసం వలస కూలీలు రాష్ట్రానికి తిరిగి వస్తున్నారు. అందులో భాగంగా తొలి విడతగా బీహార్ రాష్ట్రంలోని ఖగారియా నుంచి ప్రత్యేక శ్రామిక్ ఎక్స్‌ప్రెస్ రైలులో 225 మంది వలస కూలీలు లింగంపల్లి స్టేషన్ కు చేరుకున్నారు. తిరిగి వచ్చిన వలస కూలీలకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రైతు బంధు చైర్మన్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పూలతో స్వాగతం పలికారు. హైదరాబాద్‌కు వచ్చిన వలస కూలీలు ప్రదానంగా రైస్ మిల్లులలో పనిచేయడానికి వచ్చారని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. వలస కూలీల రాకను రాష్ట్ర ప్రభుత్వ నోడల్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్. సైబరాబాద్ సీ.పీ సజ్జనార్ స్వయంగా పర్యవేక్షించారు.

## ఎస్ బ్యాంక్ కుంభకోణంలో నిందితులకు రిమాండ్ పొడగింపు

న్యూ ఢిల్లీ, మే 8:ఎస్ బ్యాంకు కుంభకోణంలో నిందితులకు సీబీఐ కోర్టు రిమాండ్ పొడగించింది. నిందితులైన డీహెచ్ఎఫ్ఎల్ ప్రమోటర్ కపిల్ వాధవన్, ఆర్కేడబ్ల్యూ డెవలపర్స్ ప్రమోటర్ ధీరజ్ వాధవన్‌ల రిమాండ్‌ను మే 10వ తేదీ వరకు పొడగిస్తున్నట్లు కోర్టు వెల్లడించింది. మాజీ ఎస్‌బ్యాంక్ సీఈవో రాణాకపూర్‌కు లంచం ఇచ్చారన్న ఆరోపణలపై వీరిద్దరిని అరెస్టు చేశారు. మహాబలేశ్వరంలోని క్వారంటైన్‌లో వీరిని 50 రోజుల తరువాత అదుపులోకి తీసుకున్నారు. ఇంతకు ముందటి రిమాండ్ ముగియడంతో ఈ రోజు సీబీఐ అధికారులు కోర్టులో హాజరుపర్చారు. వీరిద్దరిని మరింతగా విచారించాల్సి ఉందని సీబీఐ అధికారులు కోర్టులో వాదనలు వినిపించారు. దీంతో సీబీఐ కోర్టు నిందితులకు రిమాండ్ పొడగించింది.

## యూపీకి లక్ష మాస్కులు పంపిన ప్రియాంకా గాంధీ

న్యూఢిల్లీ,మే 8:: దేశంలో అతిపెద్ద రాష్ట్రాల్లో ఒకటైన ఉత్తరప్రదేశ్‌లో కరోనా కేసులు రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా లక్నోకు లక్షకు పైగా మాస్కులను పంపించారు. వాటిని కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం పంపిణీ చేస్తారని ఉత్తరప్రదేశ్ మీడియా కోఆర్డినేటర్ లలన్ కుమార్ చెప్పారు. ప్రియాంకా గాంధీ ఇతర జిల్లాలకు ఇప్పటికే మందులను పంపించారని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు రాష్ట్రంలోని 47 లక్షలకు పైగా జనాభాకు రేషన్, ఆహార పదార్థాలను అందిచామని వెల్లడించారు.

# విశాఖలో విషాదం..

నేటినిజం
శనివారం 9-5-2020

ఊపిరి ఇవ్వాల్సిన గాలి, ప్రాణాన్ని నిలపాల్సిన నీరు కలుషితం అయిపోతే ఇక మానవాళికి మనుగడ ఏది? నిన్న విశాఖలో జరిగిన విషపు గాలి విషాదం చూస్తుంటే, 36 ఏళ్ళ క్రితం భోపాల్ గ్యాస్‌లీక్ సంఘటన గుర్తుకు వస్తోంది. దాదాపు 12 మంది ఊసురు తీసేసి ఇంకా వందలమందిని చావు బతుకుల మధ్య ఉంచేయడం అనేది మాటలు కావు.. ఈ విషాదం మాటలకు అందనిది. తప్పు ఒకరిది, అనుభవం ఇంకొకరిదా? అన్నట్లుంది వైనం. కొన్ని కీలక రసాయనాల సరఫరా నిరంతరం సాగకపోతే అనేక ప్రాణాధార ఔషదాల తయారీ సాధ్యం కాదంటూ తమ పరిశ్రమను నిత్యావసంగా గుర్తించి, లాక్‌డౌన్ నుంచి మినహాయింపు కావాలని ఏప్రిల్ రెండో వారంలో ఇండియన్ కెమికల్ ఫ్యాక్టరీ కేంద్రాన్ని మినహాయింపు కోరింది. ఇలా లాక్‌డౌన్ మినహాయింపులో భాగంగా ఉత్పత్తి ప్రారంభానికి సిద్ధమవుతుండగా ఎల్‌జి పాలిమర్స్ కర్మాగారం నుంచి అర్ధరాత్రి స్టైరెన్ గ్యాస్ లీకై సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. వీధుల్లోని పశుపక్ష్యాదులు, వీధికుక్కలు, పిల్లులు ఈ గ్యాస్ ధాటికి విలవిల లాడుతూ కనిపిస్తున్న దృశ్యాల్ని చూస్తుంటే మనం ఏ యుగంలో ఉన్నాం అనిపించక మానదు. టెక్నాలజీ పెరగటం అంటే ఇదా? నడి వీధుల్లో కుప్పకూలిపోయిన జనాలు ఎందరో..? తల్లిని కోల్పోయి కొందరు, బిడ్డల్ని కోల్పోయి కొందరు. తమవారు ఎక్కడున్నారో కూడా తెలియక వెదుక్కుంటూ కొందరు, దృశ్యాల్ని చూస్తుంటే నిత్యం ఏదో ఒక విపత్తును చూపే ఆంగ్ల చలనచిత్రాన్ని గుర్తుకు తెచ్చింది.

లోగడ వందేళ్ళు పైబడిన చక్కెర కార్మాగారం పరిశుభ్రత కొరవడిన కారణంగా అగ్ని ప్రమాదానికి లోనై 13 మంది సిబ్బందిని బలికొంది అంటూ బహుముఖంగా భద్రతాంశాలపై దృష్టిని సారించాలని మొన్నటి జనవరిలో ఎల్జీ పాలిమర్స్ సంస్థాగత లేఖను ప్రచురించింది. చట్టబద్ధ నియమ నిబంధనలను గౌరవిస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడుతామని హామీ ఇచ్చింది.

వాటిని నిర్లక్ష్యం చేయడం వలనే ఇంతటి విపత్తు జరిగిందనేది నిజం. రసాయనిక పరిశ్రమలలో గత మూడేళ్ళగా నెలకు సగటున నాలుగు భారీ ప్రమాదాలు జరిగిన తీరు, రసాయనాల వినియోగం, ఉత్పత్తి, భద్రతలను నియంత్రించే సమగ్ర చట్టం లేని లోటు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

గుజరాత్‌లోని దెహెజ్, ఒడిశా లోని పరదీప్, తమిళనాడులోని కడలూర్ తో పాటు ఏపీ లోని విశాఖను మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా అభివృద్ధి చేయనున్నామని కేంద్రం చెబుతోంది. వెలుగు కిందే చీకటి తారాడినట్లు ప్రమాదకరమైన రసాయనిక పరిశ్రమలోని వికాశాన్ని. వెన్నంటి వున్న వినాశాన్ని అలక్ష్యం చేయడం అంటే ఇదేనేమో..! అందుకే ఇలాంటి పరిశ్రమల్ని జనవాసాలకు దూరంగా ఉంచాలి. ప్రతి సంవత్సరం డిసెంబర్ 4వ తేదీన రసాయన పరిశ్రమల ప్రమాదాల దినోత్సవం ఘనంగా జరిపితే సరిపోతుందా ? పారిశ్రామిక భద్రతకు యాజమాన్యాలు, ప్రభుత్వాలు ఒకరినొకరు అర్థం చేసుకుంటూ నడిచినప్పుడే కదా జనావళి ప్రాణాలు దక్కేది...!

# విషం చిమ్మే పరిశ్రమలు అవసరమా ?

హైదరాబాద్,మే 8:విశాఖపట్నం సమీపంలోని ఎల్జీ పాలిమర్స్ కంపెనీ నుండి విడుదలైన స్టైరీన్ విషవాయువు ఘటన మరోమారు మనకు గుణపాఠం కావాలి. కాలుష్య కారక పరిశ్రమలతో ప్రాణహాని తప్ప ప్రయోజనం లేదని గుర్తించాలి. లాక్‌డౌన్ కారణంగా ఎన్నో కొత్త పాఠాలు నేర్చుకుంటున్న మనం పర్యావరణ హితం కోరే విధంగా ముందుకు సాగాల్సి ఉంది. ఎల్జీ పాలిమర్స్ సంస్థ ఉత్పత్తి చేసే వస్తువులు వాడకుంటే కొంపలేం అంటుకోవు. కరోనా లాక్‌డౌన్‌తో గత జీవితానికి... ఈ రెండు నెలల జీవితానికి ఎంతో తేడా వుంది. ఏది లేకున్నా బతకగలమన్న అనుభవ పాఠం ప్రతి ఒక్కరి సొంతం అయ్యింది. మద్యం లేకున్నా ఉండగలమని నిరూపించాం. అయితే ప్రభుత్వాలు మళ్లీ మద్యం దుకాణాలు తెరవగానే ఎగిరి గంతేసి క్యూ కట్టాం. ఇప్పుడు ఎల్జీ పాలిమర్స్ వంటి సంస్థల సంగతి కూడా అంతే. కరోనా కష్టాలతో ఇప్పటికే బిక్కుచచ్చి బతుకుతున్న ప్రజలపై విషవాయువు ప్రభావం తీవ్రంగా ఉండబోతున్నది. చనిపోయిన వారు చనిపోగా బతికున్న వారు తీవ్ర నరకం అనుభవించే అవకాశం లేకపోలేదు. కరోనాను మించిన ప్రభావం గ్యాస్ లీక్ ద్వారా అనుభవంలోకి రానుంది. ఇలాంటి పరిశ్రమల వల్ల ఇప్పుడూ..ఎప్పుడూ ముప్పే. పర్యావరణానికి కూడా ముప్పే. పచ్చని పంటపొలాలు, మన పాడిపశువులు కూడా దెబ్బతిన్నాయి.గ్యాస్ ఘాటుకు ప్రజలంతా తల్లడిల్లారు. కరోనా వచ్చి చచ్చిపోయినా ఇంతటి ఘోరం ఉండేది కాదు. విశాఖ ఘటన మనకు గుణపాఠం కావాలి. ప్రజలు ఇలాంటి పరిశ్రమల వల్ల ఉపాధి పొందడం కంటే మొత్తం జీవితాలనే కోల్పోవాల్సి వస్తుందని గుర్తించాలి. భోపాల్ గ్యాస్ దుర్ఘటన తాలూకు దుష్ప్రభావాలు ఇంకా వీడడం లేదు. అలాగే ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ వల్ల కలిగిన నష్టాలు ఎంతకాలం ఉంటాయో చెప్పలేం. ప్రధానంగా ఆరోగ్య సమస్యలు తీవ్రం అవుతాయనడంలో సందేహం లేదు. పిల్లలను, వృద్ధులను మోసుకుపోతున్న వాళ్ళు, ఆ వేదన రోదనల మధ్యనే తమకుటుంబీకులను కాపాడుకొనేందుకు ప్రయత్నిస్తున్నవారితో ఈ విషాద దృశ్యాలు అనేకులకు కంటతడిపెట్టించాయి. ఐదుకిలోమీటర్ల మేరకు విస్తరించిన ఆ విషం మనుషుల నే కాదు, అమాయక పశుపక్ష్యాదులనూ పొట్టనబెట్టుకుంది. పచ్చనిచెట్లు సైతం మాడిమసై మెదలు వాల్చేసిన భయానకమైన ఘటన ఇది. ఇంతటితో ఈ నష్టం ఆగిపోతుందని భావించడానికి లేదు. భయానకమైన విషవాయువును దాచుకున్న కంపెనీ బాధ్యతారాహిత్యం కారణంగా నష్టపోయింది సామాన్యులే. ఈ వాయువు మనిషిపై చూపే దీర్ఘకాలిక ప్రభావం తీవ్రమైనది. ప్రాణవాయువుతో కలిసి నందున స్టైరీన్ మరింత ప్రమాదకర రూపాన్ని సంతరించుకొని, కొన్ని వారాలపాటు గాలిలోనే ఉండిపోతుం దన్న విశ్లేషణలు భయపెడుతున్నాయి. దశాబ్దాల తరువాత భోపాల్ విషవాయు ఘటనను మరోమారు మనకు గుర్తుచేసిన ఈ ప్రమాదంలో కంపెనీ నిర్లక్ష్యం అణువణువునా కనిపిస్తున్నది. లాక్‌డౌన్ కారణంగా మూతబడిన కంపెనీలన్నీ తగు రక్షణచర్యలు కొనసాగిస్తున్నదీ లేనిదీ కనిపెట్టాల్సిన అవసరం ఉంది.ఈ కాలుష్యకారక కంపెనీని మూసివేయాలని ఎంతోకాలంగా ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పటికీ పాలకులకు పట్టలేదు. ఇప్పుడు దీనిని ఇక మూసివేయించే దిశగా ప్రయత్నాలు సాగాలి. కరోనా కారణంగా చైనా నుంచి తరలిపోతున్న కంపెనీలకు ఘనస్వాగతం పలకండి అంటూ పాలకులు క్యూ కడుతున్నది కూడా ఇలాంటి పరిశ్రమల కోసమే. ఇలాంటి వాటిని దేశంలోకి అనుమతిస్తే కోరి విషాన్ని కొనుక్కున్నట్లే కాగలదని గుర్తుంచు కోవాలి. అభివృద్ధి దిశగా అడుగులేస్తున్నట్టు మనకు కనబడే ఈ ప్రపంచంలో ఎంతటి విషం నిండివుందో ప్రజలు గమనించాలి. ఆధునికంగా మారడానికి తోడ్పడుతున్నాయని చెప్పే అనేకానేక ఉపకరణాల ఉత్పత్తి లో ఎన్ని ప్రమాదాలు పొంచివున్నాయో గమనించాలి.ఆధునిక జీవితం నుంచి సాధారణ జీవితానికి అలవాటు పడితే అనేక ఉపకరణాల అవసరం రాదు. అలాంటి కంపెనీల కోసం వెంటర్లాడే పరిస్తితి రాదు. వేలమంది ప్రాణాలు బలిగొని, లక్షలాదిమందిని శాశ్వతంగా వ్యాధిగ్రస్తుల్ని చేసిన భోపాల్ దుర్ఘటన నుంచి మనం ఇంకా పాఠాలు నేర్చుకోలేదు. లాభాపేక్ష మినహా మరేది పట్టించుకోని బహుళజాతి సంస్థల పోకడలను, భద్రతా ప్రమాణాలు పాటించడంలో వాటి నిర్లక్ష్యాన్ని వెలుగులోకి తెచ్చింది. ఇలా పలు దుర్ఘటనలు జరుగుతున్నా, జననష్టం సంభవిస్తున్నా అప్రమత్తంగా వ్యవహరించడంలో పరిశ్రమలు, ప్రభుత్వాలు దారుణంగా విఫలమవుతున్నాయి. పౌరుల ప్రాణాలతో ముడిపడివున్న ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు హడావిడి చేసే పాలకులు తరవాత ప్రజల ప్రాణాలను పట్టించుకోరు. అనంతర పరిస్థితులను గుర్తించరు. అందువల్ల ప్రజే మేల్కోవాలి. ఎల్జీ పాలిమర్స్ విషయంలో ప్రమాదం ఎందుకు జరిగిందీ.. కారకులు ఎవరన్నది విచారణ సాగుతుంది. విచారణ నివేదికలు వస్తాయి. మళ్లీ కంపెనీ నడుస్తుంది. అయితే ఇలాగే చూస్తూ ఊరుకుందామా లేక మనకు..మనం మారుదామా అన్నది ఆలోచన చేయాలి. కాలుష్యకారక పరిశ్రమలను వ్యతిరేకించడంలో ఉద్యమించాలి. ప్రాణాలకు తెగించాలి. భవిష్యత్ తరాలను కాలుష్యానికి బలి చేయొద్దు. మన పర్యావరణాన్ని దెబ్బతీసే సంస్థలకు అనుమతించేలా పాలకులు చూడకుండా చేయాలి. అప్పుడే మనకు ప్రశాంత జీవనం దక్కుతుంది. లాక్‌డౌన్ పాఠాలతో మనమంతా భారతీయ సనాతన సంప్రదాయాలకు అలవాటు పడి జీవితాలను మార్చుకుందాం. వ్యవసాయకంగా బలపడదాం. ఉన్నంతలో బతకడంతో పాటు ఆధునిక హంగూ ఆర్భాటాలకు దూరంగా ఉందాం.

## రెడ్‌క్రాస్ సంస్థకు ఊపిరి పోసిన హెన్రీ దునాంట్
### -నేడు ఆయన జయంతి

న్యూఢిల్లీ,మే8(ఆర్ఎన్ఎ): యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే 'రెడ్‌క్రాస్ సొసైటీ'. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇలాంటి సేవా సంస్థలన్నింటిలోకీ అతి పెద్దది. 1895వ సంవత్సరంలో ఫ్రాంకో-సార్డియన్ కూటమికి, ఆస్ట్రియా సామ్రాజ్యవాద సైనిక దళాలకు మధ్య జరిగిన యుద్ధంలో దాదాపు 40 వేలమంది సైనికులు అసువులు బాయగా, వేలాది మంది గాయపడ్డారు. ఈ యుద్ధంలో గాయపడ్డ క్షతగాత్రులను ఆదుకుని, వారికి సేవలందించేందుకు అప్పట్లో స్విట్జర్లాండ్‌కు చెందిన హెన్రీ దునాంట్ అనే వ్యక్తి ముందుకొచ్చాడు. ఆ సంఘటన తరువాత... తానే ఇలాంటి వారికోసం ఓ సేవాసంస్థను ఎందుకు స్థాపించకూడదని హెన్రీ దునాంట్ ఆలోచనలో పడ్డాడు. అతని ఆలోచనల ఫలితంగా ఏర్పడిన సంస్థే ఈ రెడ్‌క్రాస్ ఇంటర్నేషనల్ సొసైటీ. అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటైన ఈ సంస్థ ఇప్పుడు దాదాపు అన్నిరకాల సేవా కార్యకలాపాలను నిర్వహిస్తోంది. స్విడ్జర్లాండ్ దేశపు జాతీయ జెండాలోని ఎర్రని బ్యాక్‌గ్రౌండ్‌లో తెల్లని క్రాస్ ఉంటుంది. దానిని తారుమారు చేసి తెల్లని బ్యాగ్రౌండ్‌లో ఎర్రని క్రాస్‌ను లోగోగా ఏర్పరిచాడు. 8-5-1812న జన్మించిన హెన్రీ డ్యూనెన్ట్ గౌరవార్థం ప్రతి సంవత్సరం మే 8న ప్రపంచవ్యాప్తంగా రెడ్ క్రాస్ దినోత్సవం జరుపుకుంటారు. 1901 లో ఈయనకు నోబెల్ బహుమతి లభించింది.

## అన్నదాన ముఖాల్లో ఆనందం
### రుణమాఫీ, రైతుబంధుతో తీరనున్న కష్టాలు

నిజామాబాద్,మే8(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారితో అన్నిరంగాల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రదానంగా రైతులు ఆపదలో చిక్కుకున్నా తెలంగాణ ప్రభుత్వం వారికి అండగా నిలిచింది. ఆపత్కాలంల కూడా రైతుబంధు నిధులు విడుదల చేసిన సిఎం కెసిఆర్ పెద్ద మనసు చాటుకున్నారు.ధాన్యం కొనుగోళ్లను వేగంగా చేపట్టారు. ఇప్పుడు ఎంతో మంది రైతులు పెట్టుబడి ఎట్ల అని ఆలోచిస్తున్న తరుణంలో రుణమాఫీ, రైతుబంధులకు నిధులు విడుదల చేసి వారిలో భరోసా నింపారు. మొత్తంగా ఆపత్కాలంలోనూ అన్నదాతకు రాష్ట్ర సర్కారు అండగా నిలుస్తున్నది. పంట రుణ మాఫీతోపాటు వానకాలం సాగుకు అవసరమైన 'రైతుబంధు' గ్రాంటును విడుదల చేసింది. రెండుమూడు రోజుల తర్వాత నేరుగా ఖాతాల్లో జమచేస్తున్నట్లు ఆర్థిక, వ్యవసాయ శాఖ మంత్రులు టీ హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి ప్రకటించడంపై రైతుల్లో హర్షం వ్యక్తమైంది. ఇప్పటికే సుమారు 30 వేల కోట్లు వెచ్చించి రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం, విక్రయించిన నాలుగైదు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నది. మరోవైపు ఆర్థిక సంక్షోభం ఉన్నా 25 వేల లోపు పంట రుణాలు తీసుకున్న వారికి ఏకకాలంలో మాఫీ చేస్తున్నది. ఇక లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులకు ప్రస్తుతం 25 శాతం మాఫీ చేస్తున్నది. వీరికి ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్నారు. మిగతా రైతులకు 25 శాతం మాఫీ చేస్తున్నారు. ఇక రైతుబంధు పథకం కింద వచ్చే వానకాలం సీజన్ కోసం ఇప్పుడే గ్రాంటు విడుదల చేశారు. ఇటు రైతుబంధు, అటు రుణ మాఫీకి సంబంధించిన గ్రాంటు వచ్చే సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ అవుతుందని స్పష్టం చేస్తున్నారు. రైతు రుణమాఫీపై సీఎం కేసీఆర్‌కు పలువురు కృతజ్ఞతలు తెలియజేశారు. లాక్‌డౌన్‌తో రెండు నెలలుగా ప్రభుత్వానికి ఆదాయం పడిపోయినా ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీలో భాగంగా మొదటివిడుతగా రూ.25 వేల లోపు రుణం కలిగిన 6.10 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలిగించేలా రూ.1,210 కోట్లను విడుదలచేసి మాట నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్‌కు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ మారం గంగారెడ్డి వేర్వేరు ప్రకటనల్లో ధన్యవాదాలు తెలిపారు.

## ఇక రోజూ టెస్ట్ చేయించుకుంటానంటున్న ట్రంప్



హైదరాబాద్, మే 8: వైట్ హౌస్ లో సహాయకునిగా పనిచేసే ఓ సైనికదళ జవానుకు కరోనా పాజిటివ్ రావడం సంచలనం కలిగించింది. దీంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు, ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్‌కు గురువారం కరోనా పరీక్షలు నిర్వహించగా నెగెటివ్ వచ్చింది. టెక్సాస్ గవర్నర్‌తో సమావేశం సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ కరోనా వచ్చన జవానును తాను కలుసుకోలేదని చెప్పారు. ఆరోగ్యపరమైన జాగ్రత్తల్లో భాగంగా ఇకనుంచి రోజూ పరీక్షలు చేయించుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో ట్రంప్ గానీ, పెన్స్ గానీ మాస్కులు ధరించకపోవడం గమనార్హం. వైట్‌హౌస్‌లో అధ్యక్షుని దగ్గర పనిచేసేవారికి క్రమం తప్పకుండా పరీక్షకానీ కొందరు సిబ్బంది, సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు మాస్కులు లేకుండా డ్యూటీకి వస్తున్నారు. 'ఇదివరకైతే వారానికి ఒకసారి పరీక్షజ జరిగేది. ఇకనుంచి రోజుకు ఒకసారి పరీక్ష చేయించుకుంటా. అయినా ఏమైనా జరగొచ్చు' అని ట్రంప్ అన్నారు.

## పదో తరగతి పరీక్షలకు సర్వం సన్నద్ధం
### ఇంటర్ వాల్యూవేషన్‌కు ఏర్పాట్లు: సబిత

హైదరాబాద్,మే8(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని 9.50 లక్షల మంది ఇంటర్మీడియట్ విద్యార్థుల పరీక్షల వ్యాల్యుయేషన్ పక్రియ మొదలైందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. సిఎం ఆదేశాల మేరకు ప్రక్రయను చేపట్టామని అన్నారు. ఆమె గురువారం పదోతరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.

ఈ సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తి అయ్యాయి. విద్యా సంవత్సరాని ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. 33 సెంటర్లలో మే 12వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ వాల్యుయేషన్ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఇక వాల్యుయేషన్ పక్రియలో అన్ని జాగ్రత్తులు తీసుకుంటామని సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. జూన్ రెండో వారంలో ఇంటర్మీడియట్ ఫలితాలను విడుదల చేస్తామని ఆమె తెలిపారు. 856 మంది ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఒక పరీక్ష మిగిలిపోయిందని, ఆ పరీక్షను 18వ తేదీన నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. పదో తరగతికి సంబంధించిన 8 పరీక్షల నిర్వహణ కోసం కోర్టు అనుమతి తప్పనిసరి అని, అందుకు కోర్టుకు అఫిడవిట్ దాఖలు చేస్తామని ఆమె తెలిపారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధంగా ఉండాలని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు.

# జిల్లాలో సాధారణ స్థాయికి పరిస్థితులు

### కరోనా కట్టడిలో అధికారుల సఫలం
### నిరంతర పర్యవేక్షణతో లాక్‌డౌన్ అమలు

నిర్మల్,మే8(ఆర్ఎన్ఎ): జిల్లాలో మహమ్మారి ప్రభావం తగ్గుముఖం పట్టడంతో అధికారులు ఊపిరి పీల్చుకుంట ఎన్నారు. అయినా ఎక్కడా అలసత్వం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుక ఎంటూనే ఉన్నారు. ఓ వైపు అధికారులు లాక్ డౌన్ కొనసాగుతోందని, నిబంధనల తో కూడిన సడలింపులు ఇచ్చామని స్పష్టంగా చెబుతున్నా.. కొందరు పెడచెవిన పెడుతున్నారు. కొంతమంది అనుసరిస్తున్న ఇలాంటి తీరుతో మిగతా సమాజమంతా భయాందోళనకు గురి అవుతోంది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న జిల్లాను మళ్లీ కరోనా మహమ్మారి బారిన పడనివ్వద్దని, నిబంధనలను ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులు భావిస్తున్నారు. జిల్లా కలెక్టర్,ఎస్పీలు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సడలింపు ఇవ్వాలని సూచించడంతో జిల్లా అధికారులు ఆ దిశగా పలు సడలింపులు ప్రకటించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అత్యవసర సేవలతో పాటు నిత్యఅవసరాల కొనుగోలు కోసం కిరాణా దుకాణాలు తెరిచి ఉంచే అవకాశం కల్పించారు. అవసరం ఉన్నవారికి ఈ సడలింపులు ఊరటనిచ్చే విషయమే. కానీ.. ఇదే అదనుగా చాలా మంది అవసరం లేకున్నా.. అత్యవసరం కాకున్నా.. రోడ్లపైకి వస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. కనీస నిబంధనలు పాటించక పోవడం భయానికి గురి చేస్తోంది. విచ్చలవిడిగా రోడ్లపై దుకాణాల వద్ద తిరుగుతూ కనిపిస్తున్నారు. భౌతిక దూరం పాటించడం అనే ఈ విషయాన్ని మర్చిపోయినట్లు ప్రవర్తిస్తున్నారు. కనీసం మాస్క్‌లను సైతం ధరించకుండా మిగతా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అత్యవసర, నిత్యావసరాలకు సంబంధించిన దుకాణాలను మాత్రమే తెరిచి ఉంచాలని స్పష్టంగా చెప్పినా... ఇతర దుకాణాలను సైతం తెరుస్తున్నారు. పోలీసులు వచ్చినప్పుడు మూసివేయడం వారు వెళ్లగానే మళ్లీ తెరవడం కొనసాగిస్తున్నారు. అయితే సంపూర్ణ లాక్‌డౌన్ అమలుతో పరిస్థితులలో కొంత మార్పు వచ్చింది. పక్షం రోజులుగా జిల్లా కేంద్రంలో కేవలం ఒకే కేసు మాత్రమే నమోదైంది. క్వారంటైన్ పీరియడ్ పూర్తి కావడంతో కంటైన్మెంట్ జోన్లను కూడా ఎత్తి వేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సడలింపులు కూడా ఇచ్చా రు. ఇంతవరకు బాగానే ఉన్నా.. సడలింపులు ప్రారంభమైనప్పటి నుంచి చాలామంది ఇక కరోనా పోయిందన్నట్లుగానే వ్యవహరించడం మిగతా వారిని ఆందోళనకు గురి చేస్తోంది. విచ్చలవిడిగా రోడ్లపైకి రావడం, కనీస భౌతిక దూరం పాటించకుండా వ్యవహరించడం కలవరపరుస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన పాజిటివ్ కేసులు, ప్రస్తుత పరిస్థితులను బట్టి కరోనా ప్రభావం తగ్గుతుందని భావిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం వరకు 20 పాజిటివ్ కేసులతో దేశంలోని రెడ్‌జోన్లలో ఒకటిగా జిల్లా కొనసాగింది. ప్రస్తుతం పాజిటివ్ వచ్చిన వారిలో ఎనిమిది మంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కావడం తెలిసిందే. జిల్లాలో ఢిల్లీ వెళ్లి వచ్చిన వారితోనే కరోనా కేసులు మొదలయ్యాయి. మొదటి వ్యక్తి గాంధీ ఆస్పత్రిలో మృతి చెందడం కలకలం సృష్టించింది. సంబంధిత వ్యక్తికి చెందిన ప్రాంతాన్ని కంటైన్మెంట్ జోన్‌గా ప్రకటించారు. అలా మొదలై జిల్లాలో 20 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దేశంలోని రెడ్ జోన్‌లలో ఒకటిగా జిల్లా నమోదైంది. పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాలన్నింటినీ కంటైన్మెంట్ జోన్లుగా జిల్లా అధికారులు ప్రకటించారు. మొత్తం 14 ప్రాంతాలతో పాటు ప్రభావిత గ్రామాలను సైతం కంటైన్మెంట్ గానే పరిగణించారు. వీటిని ప్రకటించి కూడా 14 రోజుల పీరియడ్ పూర్తయింది. ఆయా ప్రాంతాలలో మళ్లీ పాజిటివ్ కేసులు సైతం నమోదు కాలేదు.

# పెళ్లి ముహూర్తాలకు ఇప్పట్లో కష్టమే

### కఠిన ఆంక్షల నేపథ్యంలో పెళ్లిళ్ల వాయిదాకే మొగ్గు
### దెబ్బతిన్న కోట్లాది రూపాయల వ్యాపారం

హైదరాబాద్,మే8(ఆర్ఎన్ఎ): కరోనా అన్ని రంగాలపైనా తీవ్ర ప్రభావం చూపినట్ఉలగానే పెళ్లిళ్లపై తీవ్ర ప్రభావంచూపింది. ఇప్పుడు లాక్‌డౌన్ పాక్షికంగా ఎత్తేసినా పెళ్లిళ్లు అనుమానమే అని పురోహితులు అంటున్నారు. కేవలం 50మందికి మాత్రమే పెళ్లిలకు అనుమతి ఇవ్వడంతో పెళ్లిళ్లు జరగడం అనుమానమే అని అంటున్నారు. అత్యవసరమైన వారు దగ్గరి బంధువనలు పిల్చుకుని తంతు ముగిస్తారు. దీంతో ఈ రంగంపై ఆధారపడ్డ అనేక అనుబంధ పనలుకు సంబంధించిన వారి ఉపాధి కోల్పోనుంది.కరోనా కారణంగా ఇంతకాలం పెళ్లిళ్లు వాయిదా పడుతూ వచ్చాయి.

గత నెల 22న జనతా కర్ఫ్యూ, ఆ వెంటనే దేశ వ్యాప్త లాక్‌డౌన్ విధించడంతో పెళ్లిళ్లు, ఫంక్షన్లు ఆగిపోయాయి. భౌతిక దూరం పాటించడమే కరోనా వైరస్‌కు విరుగుడని నిపుణులు తేల్చడంతో ప్రభుత్వాలు లాక్‌డౌన్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నాయి. దీంతో పెళ్లిళ్లకు, ఇతర శుభకార్యాలకు బ్రేక్ పడింది. అప్పటికే నిశ్చయమైన ఎన్నో పెళ్లిళ్లు ఆగిపోయాయి. వచ్చే ఐదారు నెలల్లో ముహూర్తాలు ఉన్నా వేలాది మంది శుభకార్యాల నిర్వహణకు ముందుకు రావడం లేదు. తమ పెళ్లిళ్లను వాయిదా వేసుకునే ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఇలా కరోనా కారణంగా వేలాది పెళ్లిల్లు వాయిదా పడ్డాయి. వైరస్ ప్రభావం తగ్గిన తరువాత తిరిగి ముహూర్తాలు చూసుకోవచ్చని చాలా మంది పెళ్లిళ్లను వాయిదా వేసుకున్నారు. మే 29 నుంచి జూన్ 7 వరకు శుక్ర మౌఢ్యం ఉండడంతో ఆ సమయంలో శుభ ముహూర్తాలు లేవు. ఆ తరువాత ఉన్నప్పటికీ వర్షాకాలం సీజన్ మొదలవుతుంది. దీంతో ఆగస్ట్ తరవాత ముహూర్తాలు ఉన్నా.. అనుమానమే అని అంటున్నారు. ఏప్రిల్, మే మాసాల్లో ముహూర్తాలకు సంబంధించి చాలా ఫంక్షన్ హాళ్లు ఎప్పుడో బుక్ అయిపోయాయి. అయితే, కరోనా ప్రభావంతో పెళ్లిళ్లు వాయిదా పడ్డాయి. దీంతో అడ్వాన్సులు వాపస్ ఇవ్వాల్సి వచ్చిందని ఫంక్షన్ హాల్ నిర్వాహకులు తెలిపారు. తరువాత తేదీ ఖరారు చేసుకున్నాక తిరిగి అడ్వాన్సులు ఇస్తామంటూ చాలా మంది డబ్బులు రిటర్న్ తీసుకున్నారని చెప్పారు. పెళ్లిళ్లపై ఆధారపడి వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఇందులో కోట్లాది రూపాయాల బిజినెస్ ముడిపడి వుంది. ఫంక్షన్ హాళ్లలో పని చేసే వారితో పాటు డెకొరేటర్స్, క్యాటరర్స్, కుక్, సర్వర్స్, మేలతాళం, బ్యాండు మేళం, ఫొటో, వీడియో గ్రాఫర్స్.. ఇలాంటి వారంతా కరోనా కారణంగా ఉపాధికి దూరమయ్యారు. పెళ్లి పందిళ్లు తయారు చేసేవారు, డెకరేషన్ చేసే వారు, వంటలవారు, మేలతాళంతో పాటు పంతుళ్లూ పనిలేక ఉండాల్సి వస్తోంది. సీజన్‌లో నా లుగు డబ్బులు సంపాదించాలని ఆశపడ్డ వారిని క రోనా దారుణంగా దెబ్బ తీసింది. మరో పదిహేను, ఇరవై రోజులు ఇలాగా ఉండాల్సిన పరిస్థితుల నేపథ్యంలో వారంతా ఆందోళన చెందుతున్నారు. పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే చాలు వస్త్ర దుకాణాలు, బంగారు షాపులు, ఫర్నిచర్, స్టీల్ దుకాణాలు, లేడీస్ ఎంపోరియంలు... ఇలా రకరకాల వ్యాపారాలు జోరుగా సాగేవి. పెళ్లిళ్లు లేకపోవడంతో ఆయా వ్యాపారాలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. సీజన్‌లోనే మూతవేసి ఉంచడం మూలంగా కిరాయిలు చెల్లించడం, పని వాళ్లకు జీతాలు సమకూర్చడం భారంగా మారింది. అలాగే బంగారు ఆభరణాలు చేసే స్వర్ణకారులు, పెళ్లి తంతు నిర్వహించే బ్రాహ్మణులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తంగా కరోనా ఎంతో మంది ఉపాధికి గండి కొట్టింది. పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే ఫంక్షన్ హాళ్లు కళకళలాడేవి. పెళ్లిళ్లు, రిసెప్షన్లతో ఎప్పుడు చూసినా బిజీగా ఉండేవి. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా కేంద్రాలతో పాటు ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, భీమ్‌గల్ పట్టణాల్లో 200లకు పైగా ఫంక్షన్ హాళ్లున్నాయి. అలాగే, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. వీటికి తోడు కుల సంఘాల భవనాలు, చిన్న చిన్న కమ్యూనిటీ హాళ్లు వేలాదిగా ఉన్నాయి. చాలా మంది నెల, రెండు నెలల ముందుగానే ఫంక్షన్ హాల్ బుక్ చేసుకుని ఏర్పాట్లకు సిద్ధమవుతుంటారు. ఎందుకంటే సమయానికి హాల్ దొరకపోతే ఇబ్బందులు ఎదురవుతాయని అందరూ ముందుగానే బుక్ చేసుకుంటారు.

## ప్రాజెక్టుల పనులు త్వరగా పూర్తి చేయాలి : మంత్రి వేముల



హైదరాబాద్, మే 8: కోటి ఎకరాలకు సాగునీరు అందిచడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు-భవనాలు, హౌసింగ్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఎస్సారెస్పీ నుంచి నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు గోదావరి నీళ్లను లిఫ్ట్ ల ద్వారా తీసుకురావడానికి ఉద్దేశించబడి ప్యాకేజీ 20,ప్యాకేజీ 21 పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులతో హైదరాబాద్ లోని మంత్రి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ లక్ష్యం కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా ప్రతి సంవత్సరం కాళేశ్వరం నీళ్లతో ఎస్సారెస్పీ ని నింపడం ఖాయమన్నారు. అందులో భాగంగా ప్యాకేజీ 20,21 పనులు పూర్తయితే ఆర్మూర్ నియోజకవర్గంలో 7వేలు, బాల్కొండ నియోజకవర్గంలో 80వేల ఎకరాలు, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 1లక్ష 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ప్యాకేజీ 21-ః మెట్పల్లి పైపులైన్ పనుల్లో వేగం పెంచి ఈ వానాకాలం సీజన్ కు ఆర్మూర్, జక్రాన్ పల్లి, వేల్పూర్ మండలాల్లోని 20 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సిద్ధం కావాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు పైపులైన్ పనులకు ఆటంకం కలిగించ వద్దని, పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఆటో డ్రైవర్లకు నిత్యావసర సరుకులు పంపిణీ



నిజామాబాద్, మే 3: లాక్‌డౌన్ కారణంగా ఆటోడ్రైవర్లకు ఉపాధి లేకుండా పోయింది. ఈ క్రమంలో పలువురు నాయకులు ముందుకు వచ్చి ఆటో డ్రైవర్లను ఆదుకుంటున్నారు. మోర్తాడ్ మండల కేంద్రంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతో టీఆర్ఎస్ పార్టీ నాయకులు.. ఆటో డ్రైవర్లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. 230 మంది ఆటో డ్రైవర్లకు బియ్యం, పప్పు, నూనె, కారంను అందించారు. ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి ఆటో డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు.

## చెన్నమనేని పౌరసత్వంపై విచారణ
### జూన్ 16కు వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్,మే8(ఆర్ఎన్ఎ): వేములవాడ టిఆర్ఎస్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ పౌరసత్వంపై హైకోర్టులో విచారణ జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. చెన్నమనేని రమేష్ అంశంలో కేంద్ర హోంశాఖ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని పిటిషనర్ ఆది శ్రీనివాస్ హైకోర్టును కోరారు. మరోవైపు కేంద్ర హోంశాక పౌరసత్వం రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని చెన్నమనేని రమేష్.. హైకోర్టును కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. జూన్ 16న మరోసారి పూర్తి వాదనలు వింటామని తెలిపింది. అనంతరం తదుపరి విచారణను జూన్ 16వ తేదీకి వాయిదా వేసింది. రమేష్ కుమార్ పౌరసత్వం చెల్లదంటూ కేంద్ర హోంశాఖ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని పిటిషనర్ ఆది శ్రీనివాస్ కోర్టును కోరారు. మరోవైపు మరోవైపు కేంద్ర హోంశాఖ పౌరసత్వం రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని చెన్నమనేని రమేష్ తరపు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం జూన్ 16న మరోసారి పూర్తి వాదనలు వింటామని తెలుపుతూ.. తదుపరి విచారణను జూన్ 16 కు వాయిదా వేసింది. లాక్‌డౌన్ కారణంగా ఈ పిటిషన్‌పై విచారణను హైకోర్టు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టింది. కాగా వేములవాడ శాసన సభ్యుడైన చెన్నమనేని రమేష్‌కు జర్మని దేశంలో పౌరసత్వం ఉందంటూ ఆయన సమీప అభ్యర్థి ఆది శ్రీనివాస్ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే.

## రైలు ప్రమాద ఘటన దురదృష్టకరం
### వలస కూలీల తరలింపునకు చర్యలు తీసుకోవాలి: పవార్

ముంబై,మే8(ఆర్ఎన్ఎ): ఔరంగాబాద్ రైలు దుర్ఘటన హృదయ విదారకమని, చాలా బాధ కలిగించిందని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ పేర్కొన్నారు. వలస కార్మికులను తమ తమ స్వస్థలాకు క్షేమంగా చేర్చే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. కేంద్రం తీరు వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గూడ్స్ రైలు ప్రమాదంలో వలస కార్మికులు మృతి చెందడం అత్యంత బాధాకరం. వలస కార్మికులు కాలినడకన తమ తమ స్వస్థలాలకు వెళ్లడాన్ని ప్రభుత్వాలు చాలా సీరియస్‌గా తీసుకోవాలి. వారు క్షేమంగా స్వస్థలాలకు చేరడానికి అవసరమైన అన్ని చర్యలూ ప్రభుత్వాలు తీసుకోవాలి. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటిస్తున్నా. చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని పవార్ ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు.

# పశువులపై రసాయన ప్రభావం తీవ్రం

## కంపెనీ ముందు ఆందోళనకు దిగిన స్థానికులు

విశాఖపట్టణం,మే8(ఆర్ఎన్ఎ): రసాయనవాయువు స్థానిక మూగజీవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. నురగలు కక్కుతూ పశువులు నేలకొరిగాయి. ఇక్కడ పాడిపరిశ్రమపై ఆధారపడి రైతులు జీవిస్తున్నారు. తమపాడి పశువులు చనిపోవడంతో స్థానికులు కంపెనీవద్ద ఆందోళనకుదిగారు. కంపెనీని మూసివేయాలని, బాధితులను అన్నివిధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా ఎల్జీ పాలిమర్స్‌లో ఇలాంటి ప్రమాదమే చోటు చేసుకుంది. అయినప్పటికీ కంపెనీ సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంవల్లనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. లాక్ డౌన్ కారణంగా 45 రోజుల నుంచి పరిశ్రమలో ఎలాంటి పనులు జరగకపోవడంతో స్టైరిన్ నిలువ ఉంచే చోట ఒత్తిడి పెరిగి ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. మిగిలిన గ్యాస్ వాయువులతో పోలిస్తే ఇది చాలా బరువైన వాయువు దీంతో ప్రమాదం జరిగినచోట అర కిలోమీటరు పరిధిలో విషవాయువు తీవ్రత ఎక్కువగా ఉంది. అలాగే మూడు కి.మీ. పరిధిలో ప్రజలు కొంతవరకు అస్వస్థతకు గురయ్యారు. గ్యాస్ ప్రభావం ఒకటి రెండు రోజుల వరకు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

# విశాఖ బాధితులకు అండగా ప్రభుత్వం

## ప్రమాద ఘటనపై తక్షణమే స్పందించిన అధికారులు

## మంత్రులు రంగనాథరాజు, తానేటి వనిత

ఏలూరు,మే8(ఆర్ఎన్ఎ): విశాఖలో స్టైరైన్ గ్యాస్ లీకేజ్ ఘటనపై మంత్రులు రంగనాథ రాజు, తానేటి వనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. విశాఖలోని గోపాలపట్నం పరిధిలోని ఆర్ఆర్ వెంకటాపురంలోని ఎల్‌జీ పాలిమర్స్ పరిశ్రమలో భారీ ప్రమాదం చోటుచేసుకున్న దుర్ఘటనపై మంత్రులు మాట్లాడుతూ.. బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఘటనపై అధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి, బాధితులను ఆసుపత్రికి తరలించారన్నారు. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది చనిపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారని, స్టైరైన్ గ్యాస్ లీకేజీ ఘటనపై సీఎం వెంటనే విచారణకు ఆదేశించారని పేర్కొన్నారు. బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉన్నతాధికారులతో కలిసి విశాఖపట్నం వెళ్లారని, ఇలాంటి క్లిష్ట సమయంలో అందరూ బాధితులకు అండగా ఉండాలని కోరారు. లాక్‌డౌన్ సమయంలో ఎల్జి పాలిమర్స్ కంపెనీకి 45 డ్యూటీ పాసులు ఇచ్చామని, 20 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలో నిలువ ఉంచాల్సిన స్టైరైన్ గ్యాస్ నిర్వహణ లోపం వల్ల లీక్ అయినట్లుగా భావిస్తున్నామన్నారు. విచారణలో పూర్తి వాస్తవాలు వెలుగు చూస్తాయని తెలిపారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులో ఉందని, బాధితులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని మంత్రులు పేర్కొన్నారు.

# నిరుపేద ఛాయచిత్రకారులకు భరోసా కల్పించిన టి.ఆర్.కె

## లాక్ డౌన్ తో ఉపాధి కోల్పోవడంతో ఇబ్బందులు పడుతున్న ఫొటో గ్రాపర్ లకు టి ఆర్ కె చారిటబుల్ ట్రస్ట్...




వేములవాడ మే 8 (నేటినిజంప్రతినిధి):ఆపద సమయంలో అండగా నిలుస్తుందని ట్రస్టు డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ అన్నారు. వేములవాడ పట్టణంలో ని నిరుపేదలైన ఫోటో గ్రాఫర్ లకు శుక్రవారం ట్రస్టు సభ్యుల చేతుల మీదుగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ మహేశ్ కుమార్ మాట్లాడుతూ లాక్ డౌన్ తో ఫోటో గ్రాఫర్లు ఉపాధి కోల్పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని తోట రామ్ కుమార్ ఆదేశాల మేరకు వారికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశామన్నారు. సహాయం కోసం ఎదురు చూసే వారికి టి ఆర్ కె ట్రస్ట్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ట్రస్ట్ సభ్యులు కేవీ.మహేశ్ రెడ్డి, ప్రతాప్, ప్రేమ్, నాని, విజయ్, రాకేష్, కృష్ణ, నరేష్, శ్రీధర్, ఇమ్రాన్, సాయి, నితిన్, ఉన్నారు.

# కరోనాపై కలసికట్టుగా పోరాడుదాం

## విద్వేషాలకు దూరంగా ఉండాలి: గుటెర్రస్

జెనీవా,మే8(ఆర్ఎన్ఎ): నోవెల్ కరోనా వైరస్ వల్ల ప్రపంచవ్యాప్తంగా విద్వేష వాతావరణం పెరిగిందని ఐక్యరాజ్యసమితి ప్రధాని కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ తెలిపారు. మహమ్మారి వల్ల పెరిగిన విద్వేష సంఘటనలను ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. విదేశీయులను వ్యతిరేకించే భావోద్వేగాలు పెరుగు తున్నాయన్నారు. ఓ వర్గం పట్ల వివక్ష పెరుగుతోందన్నారు. ముస్లిం వ్యతిరేక దాడులు కూడా జరుగుతు న్నట్లు గుటెర్రస్ తెలిపారు. వైరస్ మహమ్మారి వల్ల విద్వేష ఘటనలు సునామీలా విరుచుకుపడు తున్నాయన్నారు. అయితే ఈ విషయంలో యూఎన్ చీఫ్.. సంఘటనలు జరుగుతున్న దేశాల గురించి ఎటువంటి విషయాన్ని వెల్లడించలేదు. ఇటువంటి రుగ్మతలను రూపుమాపేందుకు అందరం కలిసి పనిచేయాలన్నారు. వలస కార్మికులు, శరణార్థులు తీవ్ర ప్రభావానికి లోనైనట్లు చెప్పారు. వైరస్ పేరు చెబుతూ వైద్య చికిత్సకు నిరాకరిస్తున్నారన్నారు. జాతివిద్వేష, హానికరమైన అంశాలను తొలగించాలని ఆయన మీడియాను కోరారు. ఆన్‌లైన్‌లో ఫేక్ న్యూస్ పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ అక్షరాభ్యాసంపై దృష్టి పెట్టాలని ఆయన విద్యాసంస్థలను కోరారు. కలసికట్టుగా కరోనాపై పోరాడాలన్నారు.

# జామాయిల్ తోట దగ్ధం 15 లక్షల ఆస్తి నష్టం

ప్రకాశం జిల్లా , మే 8 ప్రకాశం జిల్లా పామూరు మండలంలోని బలిజ పాలెం గ్రామంలో 80 ఎకరాల జామాయిల్ తోట కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. దీంతో సుమారు రూ. 15 లక్షల మేర ఆస్తి నష్టిం జరిగింది. విషయం తెలుసుకున్న కనిగిరి అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేస్తున్నారు.



# మద్యం హోం డెలివరి ఆలోచన చేయండి

## పిల్‌పై స్పందించిన సుప్రీంకోర్టు ప్రభుత్వానికి సూచన

న్యూఢిల్లీ,మే8(ఆర్ఎన్ఎ): మద్యం అమ్మకాలను ఆన్‌లైన్‌లో అందించే ఆలోచన చేయాలని సుప్రీంకోర్టు సూచించింది.హోమ్ డెలివరీ మద్యం అమ్మకాలకు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సూచించింది. వైన్ షాపుల వద్ద భారీ జనసమూహాన్ని అరికట్టేందుకు హోం డెలివరీ అవసరమని కోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై వేసిన పిల్‌పై స్పందిస్తూ కోర్టు ఈ సూచనలు చేసింది. వాస్తవానికి ఈ కేసులో కోర్టు ఎటువంటి ఆదేశాలు జారీ చేయలేదు. సోషల్ డిస్టాన్సింగ్ అమలు చేయాలంటే.. మద్యాన్ని హోం డెలివరీ చేయాల్సిన అవసరం ఉన్నట్లు కోర్టు చెప్పింది. జస్టిస్ అశోక్ భూషణ్, సంజయ్ కృష్ణ కౌల్, బీఆర్ గవిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ సూచన చేసింది. కోర్టు ఈ కేసును వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విచారించింది. మార్చి 25వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ వల్ల మద్యం షాపులు మూతపడ్డాయి. అయితే నాలుగు రోజుల నుంచి కొన్ని రాష్ట్రాలు మద్యం అమ్మకాలను మొదలుపెట్టాయి. దీంతో జనం ఒక్కసారిగా షాపుల ముందు చేరుకుంటున్నారు. కిలోమీటర్ల కొద్దీ క్యూలైన్లు ఉంటున్నాయి. ఈ అవస్థలు తప్పించేందుకు కోర్టు ఈ సూచన చేసింది. ఇదిలావుంటే కేంద్ర ప్రభుత్వం మద్యం విక్రయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో అనేక ప్రాంతాల్లో మద్యం దుకాణాల ముందు మందు బాబులు బారులు తీరారు. అన్ని మద్యం షాపుల ముందు కిలోమీటర్ల మేర క్యూలైన్లు దర్శనమిచ్చాయి. కనీసం భౌతిక దూరం పాటించకుండా ఒకరి మీద తోసుకుంటూ లిక్కర్ కోసం ఎదురు చూసిన దృశ్యాలు అనేకం. దీంతో కొన్ని రాష్ట్రాల్లో మద్యం షాపులు తెరిచిన వెంటనే మళ్లీ మూసివేశారు. అక్కడక్కడా పోలీసులు లాఠీలకు పనిచెబుతున్నా జనం లెక్కచేయకుండా షాపుల ముందు బారులు తీరుతున్నారు. ఈ సమస్యను చెక్ పెట్టేందుకు ఢిల్లీ కేజ్రీవాల్ ప్రభుత్వం కొత్త ప్రణాళికను రచించింది. ఈ-టోకెన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇకపై మద్యం కొనాలంటే టోకెన్ విధానాన్ని అనుసరించాల్సిందే. టోకెన్ నెంబర్ ఆధారంగా ఆ టైంలోనే మద్యం షాపులకు వెళ్లాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో ముందుగా వివరాలు నమోదుచేసుకున్న వారు ఆ సమయానికి వెళ్లి నేరుగా మద్యాన్ని కొనుగోలు చేయవచ్చని తెలిపింది

# నిత్యావసర సరుకులు అందజేసిన మంత్రి కొప్పుల



జగిత్యాల,మే8(ఆర్ఎన్ఎ): జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో స్కావెంజర్లు, పార్ట్ టైం స్వీపర్లు, ఆశ వర్కర్లకు సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం మండలానికి మంజూరు అయిన కల్యాణలక్ష్మి లబ్దిదారులకు రూ.5,51,580 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. యశ్వత్ రావు పేట గ్రామ శివారులో 5 లక్షల మెట్రిక్స్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణానికి మత్రి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల మాట్లాడుతూ యశ్వత్ రావు పేట (గంగాపూర్ ) పాడి చెరువు పూడిక పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో కరోనా నియంత్రణకు సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలు గొప్పదవని కొనియాడారు. కరోనాను తరిమికొట్టేందుకు సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలన్నారు. భౌతిక దూరం పాటిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించాలన్నారు.

# తలసాని తిన్నింటి వాసాలు లెక్కపెట్టే రకం

## గతంలో కెసిఆర్, బాబులను కూడా తిట్టాడు

## హైదరాబాద్‌లో గుండాగిరి చేస్తే ఊరుకుంటామా

## మంత్రిపై మండిపడ్డ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

హైదరాబాద్,మే8(ఆర్ఎన్ఎ): రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తిన్నింటి వాసాలు లెక్కపెట్టే రకమని సంగారెడ్డి ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. తలసాని గతాన్‌ఇన పరిశీలిస్తే ఇది అర్థం అవుతుందన్నారు. గతంలో కెసిఆర్‌ను, చంద్రబాబును కూడా తిట్టిన సందర్భాలను ఆయన గుర్తు చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాదో మాట్లాడిన జగ్గారెడ్డి తమ నాయకుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. చంద్రబాబు దయతో లీడర్ అయిన తలసాని ఆయనపై కూడా ఘాటు వ్యాఖ్యలు చేశారన్నారు. బాబు దగ్గర మంత్రిగా పని చేసి ఆయననే తిట్టిన సందర్భాలు ఉన్నాయన్నారు. తాను టీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై ఎమ్మెల్యే అయ్యానని.. కానీ కేసీఆర్‌ను ఎప్పుడూ తిట్టలేదని.. ఆయన విధానాలనే వ్యతిరేకించానన్నారు. కావాలంటే గత వీడియోలు పరిశీలించొచ్చు అన్నారు. ఎవరి ఊరికి వాడే పటేల్.. మళ్లీ మళ్లీ మాట్లాడితే చాలా చరిత్రే ఉంది. అది బయటపెడతాం. హైదరాబాద్‌లో తలసాని హవా నడిస్తే.. సంగారెడ్డికి వస్తే నా హవా నడుస్తుంది. మాకు తలసాని వాడిన భాష రాదు. మాదగ్గర అందరూ చదువుకున్నవాళ్లున్నారు. మా సమస్య అదే. మీ సంగతంతా తెలుసు. తలసాని పహిల్వాన్ గిరీ చేస్తే తట్టుకునే శక్తి నాకు లేదు. హైదరాబాద్‌లో తిరగనీయకపోతే దాచుకుంటాం అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా గతంలో కేసీఆర్‌ను తలసాని విమర్శించిన ఆడియోను మీడియాకు వినిపించారు. లాక్‌డౌన్ విషయంలో ప్రభుత్వానికి సహకరించామన్నారు. తామెక్కడా రాజకీయ విమర్శలు చేయలేదన్నారు. సీఎం కేసీఆర్ వన్‌మెన్ షో చేస్తున్నారన్నారు. మంత్రులు, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందరూ డమ్మీ అన్నారు. తలసాని లాంటి మంత్రులు బయట పెద్ద మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం దగ్గర మాట్లాడే దమ్ము ఈ మంత్రులకు ఉందా? అని ప్రశ్నించారు. ఇకనైనా అవాకులు చవాకులు పేలకుండా చూడాలన్నారు. ఇలా చేస్తే ఊరుకునే వారు ఇక్కడ ఎవరూ లేరని జగ్గారెడ్డి ఘాటుగా హెచ్చరించారు.

# జైళ్లలో ఖైదీలకు కరోనా పాజిటివ్

## పాలు,కూరగాయల సరఫరాదారులపై మంత్రి అనుమానం

ముంబై,మే8(ఆర్ఎన్ఎ): పాలు, కూరగాయలు తెచ్చేవాళ్లతో కరోనా వ్యాపించిందేమోనని మహారాష్ట్ర హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఎనిమిది జైళ్లలో సంపూర్ణ లాక్‌డౌన్ కొనసాగుతున్నది. జైళ్ల సిబ్బందిలో ఎవరినీ బయటకు వెళ్లనీయడం లేదు. బయటి నుంచి ఎవరినీ జైళ్లలోపలికి రానీయడం లేదు. అయినా కరోనా కేసులు నమోదవుతున్నాయంటే జైళ్లకు పాలు, కూరగాయలు తదితర సామాగ్రిని సరఫరా చేసే వారితో వైరస్ వ్యాపించిందేమో!' అని అనిల్ దేశ్‌ముఖ్ అన్నారు. మహారాష్ట్రలో 77 మంది ఖైదీలకు, 26 మంది పోలీసులకు కరోనా సోకిన విషయాన్ని మీడియా ప్రతినిధులు ప్రస్తావించడంతో మంత్రి ఈ విధంగా సమాధానం చెప్పారు.

# చేయూత సేవాసమితి నిరంతర సేవలు అభినందనీయం అది




వేములవాడ మే 8 (నేటినిజంప్రతినిధి):కరోనా వైరస్ వ్యాప్తి నైపథ్యంలో కేంద్ర, రాష్ట్ర లాక్ డౌన్ ప్రకటించిన నుండి గత 45 రోజుల నుండి పట్టణంలో చేయూత సేవాసమితి నిరంతరం అన్నదాన సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నిజయోకవర్గ ఇన్చార్జ్ ఆది శ్రీనివాస్ అన్నారు .

గురువారం వేములవాడ పట్టణంలోని నీరు పేదలకు, అభాగ్యులకు, వృద్ధులకు చిన్నారులకుఆది శ్రీనివాస్ అన్నదానం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విపత్కర పరిస్థితిలో ప్రతి ఒక్కరూ వారికి తోచిన విధంగా నిరుపేదకు సాయం అందించాలని వారు కోరారు .

లాక్ డౌన్ సడలింపు సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తప్పని సరిగా మాస్కులు ధరించాలని అలాగే బౌతిక దూరాన్ని పాటిస్తూ కరోనా వైరస్ దరి చేరకుండా చూసుకోవల్సిన బాధ్యత అందరికీ ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి హైమద్ పాషా ,ఆటో యూనియన్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ , చేయూత సేవా సమితి సభ్యులు షేక్ రియాజ్ ,కనికరపు రాకేష్ , ప్రదీప్ ,సగ్గు శేఖర్ ,షేక్ షేక్ ఇంతియాజ్ ,ముల్కనూరు రాజు ,సగ్గు రాహుల్ ,బాబు ,శివ ,యశ్వంత్ పాల్గొన్నారు

# రాజస్థాన్‌లో కొత్తగా 64 కరోనా కేసులు

జైపూర్, మే8: రాజస్థాన్‌లోనూ కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. శనివారం కొత్తగా 64 మందికి కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 3,491కి చేరింది. అయితే, మొత్తం కేసులలో ఇప్పటివరకు 100 మంది మరణించగా, 1475 యాక్టివ్ కేసులు ఉన్నాయి. మిగతా వారంతా పూర్తిగా కోలుకుని ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారు. జిల్లాల వారీగా చూస్తే జైపూర్‌లో అత్యధికంగా 1137 మంది కరోనా మహమ్మారి బారినపడ్డారు. 851 మంది కరోనా బాధితులతో జోధ్‌పూర్ ఆ తర్వాత స్థానంలో ఉన్నది. కోటా (231), అజ్మీర్ (196), టోంక్ (136) వరుసగా తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

# విశాఖ ఘటనలో అధికారులు బాగా పనిచేశారు

## నిపుణులు సూచించే వరకు ప్రమాద స్థలానికి వెళ్లొద్దు

## మంత్రి ఆళ్లనాని సూచన

విశాఖపట్నం,మే8(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం తీసుకున్న చర్యలతో విశాఖ గ్యాస్ లీక్ బాధితులు త్వరగా కోలుకున్నారని డిప్యూటీ సీఎం ఆళ్ల నాని తెలిపారు. విశాఖపట్నం ఆర్ఆర్ వెంకటాపురంలోని ఎల్‌జీ పాలిమర్స్ గ్యాస్ లీక్ బాధితులకు అందుతున్న సహాయక చర్యలపై ఆయన పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన పరిహారం త్వరలోనే అందజేస్తామని వెల్లడించారు. ప్రమాదం జరిగిన సమాచారం అందిన వెంటనే అధికార యంత్రాంగం చాలా బాగా స్పందించిందని గుర్తుచేశారు. ప్రతి ఇంటి తలుపు తట్టి అధికారులు సహాయక చర్యలు చేపట్టారని చెప్పారు. ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. 554 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని.. 128 మంది పూర్తిగా కోలుకుని ఇళ్లకు వెళ్లారని చెప్పారు. కేజీహెచ్‌లో 305 మంది ఉన్నారని.. వీరిలో 52 మంది చిన్నారులు ఉన్నారని తెలిపారు. మిగతావారు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని.. ఎవరికీ ప్రాణప్రాయం లేదని స్పష్టం చేశారు. గ్యాస్ లీక్ బాధితులకు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుందని తెలిపారు. వైద్యులు, నిపుణులు సూచించేవరకు ప్రమాద స్థలానికి ఎవరూ వెళ్లొద్దన్నారు.

# మాస్క్‌లేని వ్యక్తికి మద్యం

## -వేయి జరిమాన విధించిన అధికారులు

సిరిసిల్ల,మే8(ఆర్ఎన్ఎ): లాక్ డౌన్ అమలును అధికారులు పక్కాగా అమలు చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కొరడా ఝులిపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాస్క్ లేని వ్యక్తికి మద్యం అమ్మినందుకు.. మల్లికార్జున వైన్స్ కు రూ. 5 వేల జరిమానా విధించారు. మాస్కులు ధరించిన వ్యక్తులకే మద్యం విక్రయించాలని లేకుంటే జరిమానా విధిస్తామని పురపాలక కమిషనర్ సమ్మయ్య హెచ్చరించారు. అలాగే మంచిర్యాల జిల్లాలో మాస్క్ లు లేకుండా తిరుగుతున్నవారికి శ్రీరాంపూర్ పోలీసులు రూ.1000 ఫైన్ వేశారు. చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో ఉదయం మార్కెట్ లో మాస్క్ ధరించకుండా కూరగాయలు అమ్ముతున్నందుకు మున్సిపల్ అధికారులు రూ. 500 ఫైన్ వేశారు.

# ఎల్జీ పాలిమర్స్ మూసేయాలి: చంద్రబాబు

హైదరాబాద్,మే8(ఆర్ఎన్ఎ): ఎల్జీ పాలిమర్స్ పరిశ్రమను వెంటనే మూసివేయాలని, అవసరమైతే అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. విశాఖ ఘటనపై శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గ్యాస్ లీక్ ప్రమాదంపై తూతూ మంత్రంగా దర్యాప్తు చేయడం సరికాదని, ఆయా రంగాల్లో నిపుణులు మాత్రమే విచారణ చేయాలన్నారు. కంపెనీపై సాధారణ కేసులు మాత్రమే పెట్టారని విమర్శించారు. గ్యాస్‌లీక్ ప్రమాదంపై ఇప్పటికే హైకోర్టు, ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఎన్‌జీటీ సుమోటోగా తీసుకున్నాయి. కేంద్రంతో మాట్లాడి ఇలాంటి పరిశ్రమల్లో మరిన్ని భద్రతా చర్యలు చేపట్టాలి. జనావాసాల మధ్య ఇలాంటి పరిశ్రమలు ఉండటం సరికాదు. పరిశ్రమలకు అనుమతి ఇచ్చేటప్పుడు నిబంధనలు పాటించాలి. ఇలాంటి ఘటనలను తేలిగ్గా తీసుకునేలా సీఎం ప్రకటన ఉంది. గ్యాస్ లీక్ ఘటనపై సమీక్ష చేయాలని కేంద్రాన్ని కోరుతున్నా. కేంద్రం నుంచి అనుమతి వచ్చిన వెంటనే విశాఖ వెళ్లి బాధితులను పరామర్శిస్తా. ధైర్యంగా ఉండాలని విశాఖ ప్రజలను కోరుతున్నా' అని చంద్రబాబు వివరించారు. గ్యాస్ లీక్ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఇంజనీరింగ్ కళాశాలల ఫీజులపై చుక్కెదురు

## సర్కార్ నిర్ణయాన్ని కొట్టేసిన హైకోర్టు

అమరావతి,మే7(ఆర్ఎన్ఎ): ఇంజనీరింగ్ కళాశాలల ఫీజులను నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 15ను సస్పెండ్ చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ మానిటరింగ్ కమిషన్ చేసిన సిఫార్సుల మేరకు రాష్ట్రంలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజులను నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ 23 ఇంజనీరింగ్ కళాశాలలు హైకోర్టును ఆశ్రయించాయి. తమ కళాశాల ఫీజు నిర్ణయం సహేతుకంగా లేదని పిటిషన్‌లో యాజమాన్యాలు పేర్కొన్నాయి. హైకోర్టులో కళాశాలల యాజమాన్యం దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో జీవోను సస్పెండ్ చేస్తూ హై కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# ఎపి ప్రభుత్వ అధికారులతో కిషన్ రెడ్డి సమీక్ష

## -విశాఖ ఘటనపై సహాయానికి హామీ

న్యూఢిల్లీ,మే8(ఆర్ఎన్ఎ): విశాఖపట్నం గ్యాస్ లీకేజీలో చనిపోయిన మృతులకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్ రెడ్డి సంతాపం ప్రకటించారు. దుర్ఘటన జరిగిన ప్రాంతంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలను ముమ్మరం చేయాల్సిందిగా ఆదేశించారు. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతో మాట్లాడి పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించనున్నట్లు వెల్లడించారు. ఈ కష్ట సమయంలో ఏపీ రాష్ట్రానికి కావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలను అందించనున్నట్లు చెప్పారు. విశాఖలోని ఎల్‌జీ పాలిమర్స్ పరిశ్రమ నుంచి పాలీవినైల్ క్లోరైడ్ గ్యాస్ లీకై 8 మంది మృత్యువాతపడగా వందకు పైగా వ్యక్తులు ఆస్పత్రుల్లో చేరారు.

# రేషన్ బియ్యం ఇక డోర్ డెలివరీ..



అమరావతి, మే 8: ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ దుకాణాల ద్వారా బియ్యాన్ని డోర్ డెలివరీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన బియ్యం డోర్ డెలివరీ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బియ్యం నాణ్యత, పంపిణీలో పారదర్శకత, అవినీతికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేయాలనుకుంటోంది.

మొబైల్ వాహనాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి బియ్యం సరఫరా చేయనున్నారు. ఇందుకోసం అత్యంత నాణ్యతతో కూడిన కాలుష్యరహిత సంచులను వినియోగించాలని ప్రభుత్వం భావిస్తోంది. రెండు లేదా మూడు నిత్యావసర సరుకులతో పాటు బియ్యం డోర్‌డెలివరీకి పౌరసరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. గ్రామ వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వర్తించనున్నారు.

# పునఃప్రారంభమైన గంగోత్రి హైవే

డెహ్రాడూన్‌ఎ మే 8: : ఉత్తరాఖండ్‌లో గంగోత్రి జాతీయ రహదారిని అధికారులు పునఃప్రారంభించారు. గురువారం కురిసిన వర్షానికి దారి పొడవునా కొండచరియలు విరిగిపడుతుండటంతో ముందుజాగ్రత్తగా చర్యగా అధికారులు 28 గంటలపాటు గంగోత్రి హైవేను మూసివేశారు. ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడటంతో రహదారిని తిరిగి ప్రారంభించారు. బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) మేనేజర్ అవ్నీష్ శర్మ ఈ వివరాలను వెల్లడించారు.

# సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



హైదరాబాద్ :, మే 8 రాష్ట్రంలో రైతాంగాన్ని ఆదుకోవడానికి రూ. 25 వేల లోపు ఉన్న రుణాలను ప్రభుత్వం ఒకేసారి మాఫీ చేసింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. రైతు బాంధవుడు సీఎం కేసీఆర్‌ను కొనియాడుతున్నారు. ఊరురా సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్నారు. రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు కేసీఆర్ మాత్రమే అని రైతులు పేర్కొంటున్నారు.

రైతుల ముఖాల్లో ఆనందం నింపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం కేసీఆర్ నినదిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే రైతు రుణమాఫీకి గురువారం రూ. 1210 కోట్లను విడుదల చేసింది ప్రభుత్వం. రైతుబంధు పథకం కోసం రూ. 7 వేల కోట్లు మంజూరు చేసింది. రైతు రుణమాఫీ వల్ల దాదాపు 5.88 లక్షల మంది రైతులు లబ్ది పొందనున్నారు.

# రక్తదానం చేయండి ప్రాణాలు కాపాడండి

వరంగల్ రూరల్,మే 8, (నేటినిజం ప్రతినిధి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వందేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరాశాఖా మాత్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు చిరస్మరణీయమన్నారు. రాష్ట్ర ఐటీ, నగర పాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచనతో రాయపర్తిలో పలువురు ప్రజాప్రతినిధులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మంత్రి రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు, నిరుపేదలకు నిత్యావసర సరకుల ను పంపిణీ చేశారు.

# కేంద్ర విద్యుత్ చట్ట సవరణ బిల్లు రైతన్నల పాలిట శాపం

నిర్మల్ , మే 8:: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సవరణ బిల్లు-2020 రైతులకు, సామాన్య ప్రజలకు శాపంగా మారనుందని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తుంటే విద్యుత్ సవరణ చట్టం పేరుతో ఉచిత కరెంట్ కు కోత పెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుండడం భాదకరమన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, రేఖా శ్యామ్‌నాయక్, రాథోడ్ బాపురావుతో కలిసి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ ముసాయిదా చట్ట రూపం దాలిస్తే దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై పెనుభారం పడనుందని, దీన్ని తమ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే ఏకీకృత విధానం వల్ల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు.. బిల్లులు మళ్లీ పుట్టుకొస్తాయని దీంతో రైతులు ఆర్థికంగా చితికిపోతారన్నారు. రైతులు నెలకు రూ. 3వేల నుంచి రూ. 4వేల మేర బిల్లుతో పాటు ఒక్కో కొత్త మీటర్ కనెక్షన్ కు సుమారు రూ. 2 వేల వరకు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఉచిత కరెంట్ ఇస్తున్న తెలంగాణ లాంటి రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాల్సింది పోయి రైతు వ్యతిరేఖ నిర్ణయాలు తీసుకోవడం విచారకరమన్నారు. రైతులకు మొదటి విడుతగా రూ. 25 వేల రుణాన్ని మాఫీ చేసిన ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు రైతు బాంధవుడు అని అన్నారు. రైతు సంక్షేమానికి కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

# ఇల్లందకుంట మార్కెట్‌ను సందర్శించిన కాంగ్రెస్ నేతలు

## రైతులకు ధాన్యం దరలు జమ కావడం లేదన్న ఉత్తమ్
## ఇతర రాష్ట్రాల్లో కొనుగోళ్లపై విమర్శలు మానాలని హితవు

కరీంనగర్, మే 8(ఆర్ఎన్ఎ): జిల్లాలోని ఇల్లందకుంటలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నేతలు సందర్శించారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తదితరులు ఇక్కడ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్.. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శలు గుప్పించారు. తామేమీ రాజకీయాల కోసం రాలేదని, ఇప్పుడు ఎలక్షన్స్ కూడా లేవన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు నష్టపోతున్నారని, దీనిపై ప్రభుత్వాన్ని నిలదీయడానికే వచ్చామని ఉత్తమ్ పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కొనుగోలు చేసిన వరి, మొక్కజొన్నకు సంబంధించి ఒక్కపైసా రైతులకు అందలేదని ఉత్తమ్ ఆరోపించారు. రైతులందరికీ మద్దతుధర కల్పించాలని ప్రభుత్వాన్ని ఉత్తమ్ డిమాండ్ చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ధాన్యానికి కేంద్రం ప్రకటించిన రూ. 1,800కు మరో రూ. 700 కలిపి మొత్తం రూ. 2,500కు కొనుగోలు చేస్తున్నారని, కేసీఆర్‌కు దమ్ముంటే తనతో కలిసి ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రావాలని ఉత్తమ్ సవాల్ విసిరారు. రైతుబంధు గురించి మాట్లాడుతున్న కేసీఆర్ ఏ పంటకు ముందు రైతుబంధు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రెండోసారి ఏర్పడి ఇన్ని రోజులైనా రుణమాఫీ చేయలేదని, పంటలు ఎప్పుడు చేతికి వస్తాయో, బస్తాలు ఎప్పుడు తెప్పించాలో తెలియని దద్దమ్మలు మమ్మల్ని విమర్శిస్తారా అని ధ్వజమెత్తారు. తెలంగాణలో వలస కార్మికులు ఎంతమందో చెప్పలేని ప్రభుత్వం వాళ్లను ఆదుకుంటుందా అని ప్రశ్నించారు. బత్తాయి ఆరోగ్యానికి మంచిదని చెప్పిన కేసీఆర్ ఎందుకు బత్తాయిలను ప్రభుత్వ పక్షాన కొనుగోలు చేయట్లేదని ప్రశ్నించారు.

అధికారంలో లేకున్నా రాష్ట్ర ప్రజల కోసం తాము పోరాడుతా మన్నారు. తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ జాగీరు కాదన్న విషయాన్ని గ్రహించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ అన్నారు. రైతుల గోస ఊరికేపోదని, సీఎంకు రైతులు తాలుగాళ్లయ్యారా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ నాలుగుసార్లు కేబినెట్ సమావేశం నిర్వహిస్తే ఒక్కసారీ రైతుల పంట నష్టం గురించి మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. సీఎం స్థాయిని మరిచి కేసీఆర్ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోన్న తాము దద్దమ్మలం, సన్నాసులం, అనడం ఆయన విజ్ఞతకే చెల్లిందన్నారు. కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, వ్యవసాయ శాఖ వైఫల్యం వల్ల రైతులకు ఎకరాకు రూ. 10వేల మేర నష్టం వాటిల్లిందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కోహెడ మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జీవన్ రెడ్డి.. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ విధానాలను తప్పుపట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నాలుగువేల కోట్ల విలువైన పంట దిగుబడి నష్టం వాటిల్లిందన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు ఈ రోజే మొదలు కాదని, అఖరు కూడా కాదని, ఈ విధానం ఎప్పటి నుంచో ఉందని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అక్రమాల వల్ల ప్రతి రైతు క్వింటాల్‌కు 5 కిలోలు నష్టపోతున్నారని చెప్పారు. తేమ పేరిట రైతులను దగా చేస్తున్నారని ÷ర్ అయ్యారు. వ్యవసాయ మంత్రి వస్తే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలా మోసం జరుగుతుందో తాను నిరూపిస్తానని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటనలు చూస్తేనేమో కడుపు నిండుతుందని, క్షేత్రస్థాయిలో చూస్తే మాత్రం కడుపు ఎండుతుందని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# వానాకాలం సాగుకు ఎరువుల కొరత ఉండొద్దు



హైదరాబాద్, మే 8:వానాకాలం పంటలకు రైతులకు కావాల్సిన ఎరువులపై హాకాభవన్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా రాష్ట్రం కోసం గతంలో కోరిన రేక్ పాయింట్లు వెంటనే మంజూరు చేయాలని రైల్వే అధికారులను కోరాలని అధికారులకు సూచించారు మంత్రి. రామగుండం ఎరువుల కార్మాగారం వెంటనే పూర్తి చేయడానికి ప్రభుత్వ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. క్షేత్రస్థాయికి ఎరువుల నిల్వలు చేరాలని మంత్రి సూచించారు. కరోనా వైరస్ ను దృష్టిలో ఉంచుకుని దానికి తగినట్లు ఎరువుల సరఫరాకు ఏర్పాట్లు చేయాలన్నారు మంత్రి. రేక్ పాయింట్లలో ఎరువులు 24 గంటలలో అన్ లోడ్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ వాటా 35 వేల మెట్రిక్ టన్నులు, మే వాటా 1.6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వెంటనే తీసుకురావాలని సమావేశంలో మంత్రి సూచించారు. రాష్ట్రంలో 2.68 లక్షల యూరియాతో కలిపి 6.3 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, మే వరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, లక్ష ఇతర ఎరువులు బఫర్ నిల్వల కింద అందుబాటులో ఉంచాలని అధికారులను అదేశించారు. సమీక్షలో మార్క్ ఫెడ్, అగ్రోస్ అధికారులు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, హ్యాడ్లింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# ఉపాధి పనులు పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి

## భౌతికి దూరం పాటించాలని కూలీలకు హితవు

వరంగల్‌రూరల్,మే8(ఆర్ఎన్ఎ): తెలంగాణలో నిరుపేదలను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకం కింద ముఖ్యమంత్రి కేసీఆర్ 170 కోట్ల రూపాయలు విడుదల చేశారని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. అందరికీ పని కల్పించి, ఉపాధిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. శుక్రవారం వరంగల్ రూరల్ జిల్లా పరిధిలోని పర్వతగిరి ఆవుకుంట చెరువులో జరుగుతన్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఇక్కడజరుగుతున్న పనులను పరిశీలించడమే కాకుండా కూలీలతో కలిసి కొద్దిసేపు కూలీపని చేశారు. చేతితో గడ్డపారపట్టి మట్టిని పెకిలించి ఎత్తిపోశారు. ఈసందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో సామాజిక భౌతిక దూరం పాటిస్తూ పనులు చేయాలని సూచించారు. ఇదే సమయంలో కొత్తగా వచ్చిన కూలీలకు సైతం పనులు కల్పించాలని అన్నారు. ప్రతి కూలీకి రోజుకు కనీసం 200 రూపాయలు వచ్చేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అందరికీ పని కల్పించాలని ఆదేశించారని, అందుకు తగ్గట్టుగానే ఎవరూపనిలేకుండా ఉండకూడదన్నారు. ఇదే సమయంలో ఉపాధి హామీ పనుల విషయమై, వరంగల్ రూరల్ కలెక్టర్ హరిత తో మాట్లాడిన మంత్రి ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులు కోసం సీఎం కేసీఆర్ రూ. 170 కోట్లు విడుదల చేశారు. అందరికీ ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్య మన్నారు. అందుకనుగుణంగా అధికారులు కూలీలకు పనులు కల్పించి రాష్ట్రంలో ఒక్క నిరుపేద కూడా ఆకలితో అలమటించ కూడదని మంత్రి పేర్కొన్నారు.

# లాభాల్లో స్టాక్ మార్కెట్లు, 9,300 పాయింట్లకు నిఫ్టీ

ముంబై,మే 8: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారాన్నిస్వల్ప లాభాలతో ముగించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ నేటి లాభాలను ముందుండి నడిపించింది. జియోలో విస్టా రూ. 11,367 కోట్ల పెట్టుబడులు పెడుతోందని రిలయన్స్ ప్రకటించడంతో... ఆ సంస్థ షేర్లు దూసుకుపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 199 పాయింట్లు లాభపడి 31,643కి పెరిగింది. నిఫ్టీ 52 పాయింట్లు పుంజుకుని 9,252 వద్ద స్థిరపడింది. ఫార్మ, ఎఫ్ఎంసీజీ, ఎనర్జీ, ఐటీ, ఇన్ ఫ్రా షేర్లలో కొనుగోళ్లు కనిపించగా ఆటో, బ్యాంకింగ్ , మెటల్ షేర్లలో అమ్మకాలు కనిపించాయి. హెచ్‌యుఎల్ టాప్ విన్నర్ గా నిలిచింది. నెస్లే ఇండియా, టెక్ మహీంద్రా , సన్ ఫార్మా, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభపడగా..మహీంద్రా అండ్ మహీంద్రా , ఎన్టీపీసీ , యాక్సిస్ బ్యాంక్ , ఇండస్ ఇండ్ బ్యాంక్ , స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు నష్టపోయాయి.

# జులై 1వ తేదీ నుంచి సీబీఎస్‌సీ 10వ తరగతి, 12వ తరగతి పరీక్షలు

ఢిల్లీ, మే 8: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెంకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌సీ) పరీక్షల తేదీలను సీబీఎస్‌సీ బోర్డు ప్రకటించింది. జులై 1వ తేదీ నుంచి జులై 15వ తేదీ వరకు 10వ తరగతి, 12వ తరగతి పరీక్షలు జరుగుతాయని తెలిపింది. దేశంలో కరోనా వైరస్ సంక్షభం వల్ల లాక్‌డౌన్ విధించిన సంగతే. దీంతో కొన్ని పరీక్షల నిర్వహణ ఆగిపోయింది. లాక్‌డౌన్ విధించిన సమయం కన్నా ముందు నిర్వహించిన పరీక్షలు కాకుండా 10వ తరగతికి చెందిన 90 సబ్జెక్టుల్లో మిగిలి ఉన్న 29 సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఢిల్లీ రాష్ట్రానికి సంబంధించి ఈశాన్య ఢిల్లీ విద్యార్థులకు మాత్రమే పరీక్షలు జరుగుతాయి. 12వ తరగతికి బిజినెస్ స్టడీస్, జియోగ్రఫీ, హిందీ(కోర్) హిందీ(ఎలక్టీవ్), హోంసైన్స్, సోషియాలజీ, కంప్యూటర్‌సైన్స్(పాత పేపర్), కంప్యూటర్‌సైన్స్ (కొత్త పేపర్), ఇన్ఫర్మేషన్ ప్రాక్టిస్ పరీక్షలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పేపర్, బయోటెక్నాలజీ నిర్వహించాల్సి ఉంది.

# చైనాలో కోతులపై కరోనా మందు ప్రయోగం

హైదరాబాద్, మే 8:కోవిడ్-19 మహమ్మారిని నిరోధించేందుకు ప్రపంచదేశాలు అవసరమైన మందును కనుగొనేందుకు ప్రయోగాలు మొదలు పెట్టాయి. అందుకోసం తమ దేశాల్లోని సైంటిస్టులు ఆ పనిలో తలమునకలయ్యారు. అయితే చైనా ఇప్పటికే కరోనా మందును కనుగొనే ప్రయత్నం లో మరో అడుగు ముందుకేసింది. బీజింగ్ కు చెందిన సినోవాక్ బయోటెక్ కంపెనీ రూపొందించిన "పికోవాక్ " అనే వాక్సిన్ ను కోతులు మీద ప్రయోగించారు. ఇండియాలో ఉండే ఓ రకమైన కోతులు పై ఈ మందు మెరుగైన ఫలితం చూపిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

# చేతులు ఉపరితల శానిటైజర్ విభాగంలోకి ప్రవేశించిన ఏషియన్ పెయింట్స్




ముంబై, మే 8: భారతదేశ అగ్రగామి పెయింట్ కంపెనీ అయిన ఏషియన్ పెయింట్స్ వైరోప్రొటెక్ శ్రేణి చేతులు ఉపరితల శానిటైజర్లతో శానిటైజర్ విభాగంలోకి ప్రవేశించింది.

కోవిడ్ -19 ను ఎదుర్కోవడంలో తీసుకుంటున్న వివిధ చర్యల్లో ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం మరియు ఈ పరీక్షా సమయంలో చేతులు ఉపరితల శానిటైజర్లకు బాగా పెరిగిన డిమాండ్ ను తీర్చేందుకు ఏషియన్ పెయింట్స్ ఈ విభాగంలోకి ప్రవేశించింది. అవసరమైన అనుమతులు అన్నీ పొందిన అనంతరం, గుజరాత్, అంక్లేశ్వర్ లోని కంపెనీ యొక్క ప్రస్తుత ప్లాంట్ లో ఈ ఉత్పాదన తయారవుతోంది.

ఆరోగ్యం మరియు పరిశుభ్రతలపై పెరిగిపోతున్న ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని, వైరో ప్రొటెక్ శ్రేణి చేతులు ఉపరితల శానిటైజర్లు అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో కూడుకొని ఉంటాయి. వివిధ పరిమాణాల్లో లభిస్తాయి. వచ్చే వారం నుంచి ఈ ఉత్పాదనలు మార్కెట్లో లభించనున్నాయి.

ఈ సందర్భంగా ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అమిత్ సింగ్లే మాట్లాడుతూ, "ఎ ప్పుడూ వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు అండగా నిలవడంలో బాధ్యతాయుత మరియు సంరక్షణ బ్రాండ్' గా ఏషియన్ పెయింట్స్ చురుగ్గా వ్యవహరిస్తూ వచ్చింది. కొంత కాలంగా మేము ఆరోగ్యం మరియు పరిశుభ్రత విభాగంలో పని చేస్తూ ఉన్నాం. గతంలో విప్లవాత్మక ఉత్పాదన రాయల్ హెల్త్ షీల్డ్ ను ప్రవేశపెట్టాం. పరిశుభ్రతకు సంబంధించి చక్కటి ప్రమాణాలతో బాక్టీరియా నుంచి ఇళ్ళకు రక్షణ అందించడంలో ఇది వినియోగ దారులకు తోడ్పాటును అందిస్తుంది. పరిశుభ్రత విభాగంలో మా పోర్ట్ ఫోలియోను సంఘటితం చేసుకునేందు కు మరియు అధికం చేయబడిన రక్షణకు గాను చేతులు ఉపరితల శానిటైజర్లకు బాగా పెరిగిన డిమాండ్ ను తీర్చేందుకు మరియు కోవిడ్ -19 మహమ్మారిని ఎదుర్కోవడంలో ప్రభుత్వానికి సాయం చేయడంలో ఇది అనువైన సమయంగా భావించాం" అని అన్నారు.

కోవిడ్ -19 మహమ్మారిని ఎదుర్కొనేందుకు 2020 మార్చిలో ఏషియన్ పెయింట్స్ రూ. 35 కోట్ల మేరకు కేంద్ర ప్రభుత్వానికి మరియు ఇతర అత్యవసర సహాయ కార్యక్రమాలకు అందించింది.

# జప్తు చేసిన వాహనాలు తిరిగి ఇచ్చేయండి : డీజీపీ మహేందర్ రెడ్డి

హైదరాబాద్,మే8 : లాక్ డౌన్ ను పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగా పోలీసులు నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశారు. వాటిని లాక్ డౌన్ ఎత్తివేశాక కోర్టులో చలానా కట్టి విడిపించుకోవాల్సి ఉంది. కాగా రోజురోజుకు జప్తు చేస్తున్న వాహనాల సంఖ్య పెరుగుతుండడంతో డీజీపీ మహేందర్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. జప్తు చేసిన వాహనాలను జరిమానా వసూలు చేసి వాహనదారులకు అందించాలని డీజీపీ పోలీస్ అధికారులను ఆదేశించారు. వేల సంఖ్యలో జప్తు చేసిన వాహనాలు భద్రపరచడంలో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నా దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీజీపీ వెల్లడించారు.

# కేరళలో 24 గంటల్లో ఒక్కటే కరోనా పాజిటివ్ కేసు

తిరువనంతపురం, మే 8:: కేరళలో గత కొద్దిరోజులుగా కరోనా కేసుల సంఖ్య తగ్గుతోంది. గడచిన 24 గంటల్లో కరోనా పాజిటివ్ కేసు ఒకే ఒక్కటి నమోదైందని రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. అంతేగాక శుక్రవారం 10 మంది కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. తాజాగా కోవిడ్-19 పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వ్యక్తి మూత్రపిండాలు చికిత్స కోసం ఇటీవల చెన్నై నుంచి ఎర్నాకులం వచ్చినట్లు సీఎం తెలిపారు. ఇవాళ కరోనా పరీక్ష చేయగా… నెగటెవ్‌గా తేలిన పది మంది కూడా కన్నూర్ జిల్లాకు చెందినవారే. కేరళలో ఇవాల్టి వరకు మొత్తం 503 మందికి వైరస్ సోకింది. ప్రస్తుతం కేవలం 16(యాక్టివ్ కేసులు) మంది మాత్రమే ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

# చిన్నారి గొంతులో ఇరుక్కున్న పోకచెక్క.. సర్జరీ చేసి తీసిన వైద్యులు

కోయంబత్తూర్:, మే 8 పోకచెక్క గొంతులో ఇరుక్కోవడంతో విలవిల్లాడుతున్న ఓ చిన్నారిని ప్రాణాపాయం నుంచి రక్షించారు కోయంబత్తూర్‌కు చెందిన వైద్యులు. చిన్నారి కొండ నాలుక కింద ఇరుక్కుపోయిన పోకచెక్కను శస్త్రచికిత్స నిర్వహించి చాకచక్యంగా తొలగించారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్ జిల్లాలోని గోబిచెట్టిపాలయం గ్రామానికి చెందిన మూడేండ్ల చిన్నారి గురువారం పోకచెక్క మింగింది. అయితే, ఆ పోకచెక్క చిన్నారి కొండ నాలుక కింద ఇరుక్కోవడంతో ఊపిరాడక విలవిల్లాడింది. దీంతో కుటుంబసభ్యులు వెంటనే పాపను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు తమవల్ల కాదనడంతో కోయంబత్తూర్‌లోని మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు.

కోయంబత్తూర్ ఆస్పత్రిలోని ఈఎన్‌టీ విభాగం హెడ్ అయిన డాక్టర్ అలీ సుల్తాన్ నేతృత్వంలోని బృందం పాపకు వెంటనే శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడింది. తక్కువ సమయంలో ఆస్పత్రికి తీసుకురావడంవల్ల పాపను ప్రాణాపాయం నుంచి రక్షించగలిగామని, లేదంటే పోకచెక్క మరింత ఉబ్బి ఊపిరాడక పాప మరణించి ఉండేదని డాక్టర్ అలీ సుల్తాన్ చెప్పారు. తల్లిదండ్రులు పసిపిల్లలను చాలా జాగ్రత్తగా చూసుకోవాలని, ఇలా గొంతులో ఇరుక్కునే ప్రమాదం ఉన్న వస్తువులేవీ వారికి అందుబాటులో ఉంచకూడదని ఆయన సూచించారు.

# జూన్ 20 లోపు రైతులు నాట్లు వేసుకోవాలి : మంత్రి అల్లోల



నిర్మల్, మే 8: రైతులు రోహిణి కార్తి లో తూకాలు పోసి జూన్ 20 లోగా నాట్లు వేస్తే బ్రహ్మాండమైన దిగుబడి వస్తుందని రాష్ట్ర అటవీ పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణంలోని గాజులపేట లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు సకాలంలో తూకాలు పోసి నాట్లు వేస్తే ధాన్యం అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. భూగర్భ జలాలు పెరిగాయని, సాగుకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం రైతుబంధు ద్వారా సాయం అందజేస్తుందన్నారు. రూ 25 వేల లోపు ఉన్న రైతు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని తెలిపారు. అలాగే రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేటప్పుడు తాలు లేకుండా జల్లెడ పట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. లాక్ డౌన్ ఉన్నందున ప్రతి ఒక్కరూ మాస్క్ ను ధరించి సామాజిక దూరం పాటించాలని సూచించారు.

## నేటి కవిత




Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com